తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి

మంగళవారం
03 నవంబర్ 2026

పేజీలు : 8

సహజ వనరులపై

మట్టి మాఫియా పంజా!

- తుమ్మలచెరువు నుంచి సీతారామ కాలువ కట్టల వరకు యథేచ్ఛగా మట్టి తరలింపు..
- ప్రభుత్వ ఆదాయానికి గండి.. ప్రాజెక్టు భద్రతకు ముప్పు!
- భారీ జేసీబీలు, పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో రాత్రింబవళ్లు దందా.. ఇరిగేషన్ శాఖ అధికారుల మౌనం వెనుక మర్మమేమిటి?

అశ్వాపురం నవంబర్ 2 (జనంసాక్షి):
ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చాల్సిన విలువైన సహజ వనరులు కొందరు అక్రమార్కులకు ఆదాయ వనరులుగా మారుతున్నాయా? ప్రజలందరికీ చెందాల్సిన సారవంతమైన మట్టిని కొందరు వ్యక్తులు తమ సొంత ఆస్తిగా భావించి యథేచ్ఛగా తరలించుకుపోతున్నా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు అశ్వాపురం మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఎంతో విలువైన తుమ్మలచెరువు మట్టితో పాటు ప్రతిష్టాత్మక సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువ కట్టలపై ఉన్న సారవంతమైన మట్టి అక్రమ తరలింపునకు గురవుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పగలు, రాత్రి తేడా లేకుండా మట్టి దందా!
అశ్వాపురం మండలంలోని తుమ్మలచెరువు, కొత్తూరు, సీతారామపురం, గుళ్లగూడెం, చింత్ర్యాల తదితర ప్రాంతాల్లో పెద్దపెద్ద జేసీబీలను ఏర్పాటు చేసి మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో పదుల సంఖ్యలో ట్రాక్టర్లు వరుసగా రాకపోకలు సాగిస్తూ మట్టిని తరలిస్తున్న తీరు చూస్తుంటే అక్కడ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయా లేక ఏదైనా జాతర జరుగుతోందా

వార్తా లోపలి పేజీలో





ఎమ్మెల్సీ ఎన్నికలకు సమాయత్తం కావాలి: జగదీశ్ రెడ్డి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై బిఆర్ఎస్ సమీక్ష సమావేశం

హుజూర్ నగర్, నవంబర్ 2 (జనంసాక్షి):
ఉమ్మడి నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై పట్టణంలోని లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్ లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్సీ ఓటర్ నమోదు హుజూర్‌నగర్ ఇన్‌చార్జి కంచర్ల కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల ఓట్ల నమోదును వేగవంతం చేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ ఓట్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, గ్రామ గ్రామాన సమావేశం నిర్వహించి బిఆర్ఎస్ పార్టీ సైనికులు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీపై రైతుల్లో చాలా వ్యతిరేకత వచ్చిందన్నారు. మళ్లీ పాత రోజులు వస్తాయి. కెసిఆర్ నాయకత్వంలో 24 గంటల కరెంటు ఇచ్చాం, కేటీఆర్ పాదయాత్ర చేస్తామనడంతో కాంగ్రెస్ పార్టీ అప్పు డప్పుడు సాగర్ నీళ్లు వదులుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఓడించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈసారి వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి, బిఆర్ఎస్ నాయకులు పిల్లుట్ల రఘు, బిఆర్ఎస్ మాజీ జడ్పిటిసి కొప్పుల సైదిరెడ్డి, జక్కుల నాగేశ్వరావు, అమర్, నగేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు

సకాలంలో అందించాలి

- ప్రతి నెల 5వ తేదీలోపు నిత్యావసర సరుకుల వివరాలు పంపించాలి
- విద్యార్థుల ఆధార్ అనుసంధానంతో ముఖ గుర్తింపు విధానంలో నమోదు చేయాలి

వార్తా లోపలి పేజీలో

ప్రజావాణి దరఖాస్తులను

సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట (జనంసాక్షి):
ప్రజా సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా

వార్తా లోపలి పేజీలో



ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజావాణి

ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 02 (జనంసాక్షి):
ప్రజా వినతుల దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.ఖమ్మం అర్బన్ మండలం కైకొండాయిగూడెం గ్రామానికి చెందిన కే.రవీంద్ర బాబు సర్వే నెంబర్ 230 లో ఉన్న భూమి సర్వే చేసి రికార్డు మార్పు చేయగలరని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఏదులాపురం పట్టణానికి చెందిన పలువురు మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ప్రభుత్వ ప్రోటోకాల్ ఉల్లంఘిస్తూ ఎన్నికైన ప్రజాప్రతి నిధులను అవమానిస్తున్నారని వీటిని సవరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ కు

మిగతా 2లో



- జీఓ 58, 59 దరఖాస్తుల పరిశీలనను పారదర్శకంగా నిర్వహించాలి కలెక్టర్ దివాకర టిఎస్

2లో

జీఓ 58, 59 దరఖాస్తుల పరిశీలనను పారదర్శకంగా నిర్వహించాలి

కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 02 (జనంసాక్షి)
జీఓ 58, 59 కింద వచ్చిన దరఖాస్తులపై క్షేత్ర స్థాయిలో సమగ్ర పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్‌తో కలిసి జీఓ 58, 59 దరఖాస్తుల పరిశీలనపై జిల్లా అధికారులు, తహసీల్దార్ల తో జిల్లా కలెక్టర్ దివాకర సమీక్ష సమావేశం, గూగుల్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో దశాబ్దాలుగా నివాస గృహాలు నిర్మించుకొని నివసిస్తున్న వారికి ఆయా స్థలాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం జీఓ 58, 59లను అమలు చేస్తున్నదని తెలిపారు. జీఓ 58 ప్రకారం 125 చదరపు గజాల లోపు ప్రభుత్వ స్థలంలో నిర్మించుకున్న నివాస గృహాలను క్రమబద్ధీకరిస్తారని, 125 చదరపు గజాలకు మించిన స్థలాల్లో నిర్మించుకున్న గృహాలను ప్రభుత్వం నిర్దేశించిన రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపుతో క్రమబద్ధీకరిస్తారని వివరించారు. జీఓ 59 క్రింద క్రమబద్ధీకరించిన భూములకు పట్టా హక్కులు కల్పించబడతాయని, నిబంధనల ప్రకారం వాటిని ఇతరులకు విక్రయించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.
దరఖాస్తుదారుడు స్వయంగా సంబంధిత స్థలంలో గృహం నిర్మించుకొని నివాసం ఉంటున్నట్లయితేనే నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరణకు అర్హత ఉంటుందని స్పష్టం చేశారు. తప్పుడు ధృవ పత్రాలు సమర్పించి ప్రస్తుతం ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములను సైతం క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉన్నందున అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.జీఓ 58, 59 దరఖాస్తుల పరిశీలన పర్యవేక్షణ కోసం మండలాల వారీగా ప్రత్యేక జిల్లా అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. సత్తుపల్లి, ఖమ్మం అర్బన్ మండలాల్లో అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చినందున అక్కడ రెండు నుంచి మూడు మంది జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు పేర్కొన్నారు.నియమించిన ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా సంబంధిత తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లి, నవంబర్ 15వ తేదీలోగా ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ప్రతి ప్రత్యేక అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి జిల్లా స్థాయిలో రూపొందించిన ప్రత్యేక ఆన్‌లైన్ లింక్ ద్వారా పరిశీలన వివరాలను నమోదు చేయాలని సూచించారు. ప్రతి దరఖాస్తుపై క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారణ జరిపి, సంబంధిత స్థలాన్ని స్వయంగా పరిశీలించాలని, భూమి విస్తీర్ణాన్ని ఖచ్చితంగా కొలవాలని ఆదేశించారు.
దరఖాస్తుదారుడి ఆధీనంలోనే సంబంధిత స్థలం ఉందా? నిజంగా ఆ స్థలంలో నివాస గృహం నిర్మించుకొని నివసిస్తున్నారా? అనే అంశాలను నిర్ధారించుకోవాలని తెలిపారు. చిన్న ఇంటి నిర్మాణం ఉండి, అధిక విస్తీర్ణంలో భూమిని క్లెయిమ్ చేసే సందర్భాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్థలానికి సంబంధించిన నాలుగు వైపుల హద్దులు, భూమి స్వభావం, విస్తీర్ణం తదితర వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలని ఆదేశించారు.దరఖాస్తుదారుల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తూనే, నిబంధనల అమలులో ఎలాంటి అలసత్వం చూపరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ క్రమబద్ధీకరణకు అనుమతించరాదని తెలిపారు. కాలువలు, చెరువులు, సహజ నీటి ప్రవాహ మార్గాలకు ఎలాంటి ఆటంకం కలిగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రతి దరఖాస్తుదారుడి నుంచి సంబంధిత ఆధార పత్రాలన్నింటినీ సేకరించాలని, క్షేత్ర స్థాయి పరిశీలన సమయంలో దరఖాస్తుదారుడితో పాటు నివాస గృహం ఫొటోలను తీయాలని తెలిపారు. పరిశీలించిన ఇంటి ఫొటోలను జియో కోఆర్డినేట్స్‌తో సహా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై స్పష్టమైన పరిశీలన నివేదిక, సంబంధిత అధికారుల అభిప్రాయాలను తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజావాణి

రాస్తూ నిబంధనలు ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కూసుమంచి మండలం తురకగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ బుర్ర కృష్ణ తమ గ్రామంలో కొమ్ము ఇందిరమ్మకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించడం జరిగిందని దురదృష్టవశాత్తు కుటుంబ సభ్యులందరూ మరణించినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆ ఇంటికి చట్టబద్ధ మైన హక్కు దారులు ఎవరైనా ఉన్నారు విషయాన్ని పరిశీలించా లని, చట్టపరమైన హక్కు దారులు ఎవరూ లేకపోతే మరో లబ్ధిదారుల్ని ఎంపిక చేసే పంపిణీ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పిడి హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.చింతకాని మండలం వందనం గ్రామం చెందిన ప్రజలు మత్స్య శాఖ సభ్యులు వందనం గ్రామ చెరువుకు సాగర్ ఎడమ కాలు ద్వారా నీటి సరఫరా పునరుద్ధరించి చెరువులు నింపాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఎస్ఈ ఇరిగేషన్ కు రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, డిఆర్ఓ సీహెచ్. రామ్మూర్తి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్
హాజరు కావాలని అన్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు.ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు.ప్రతి అధికారి తమ లాగిన్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, లేనియెడల వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.మండల స్థాయి సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన 104 దరఖాస్తులను పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జడ్పీ సీఈవో శిరీష, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డీఈవో శ్రీనివాస్, డీఎస్ఓ మోహన్ బాబు,డిడబ్ల్యుఓ నరసింహారావు, డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, సిపిఓ కిషన్, సిఎఫ్ఓ దామోదర్ రెడ్డి, శ్రీనివాసరావు, డిఐఈఓ సులోచన రాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి ఉపేందర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కనగల్లు, నవంబర్ 2 (జనంసాక్షి):
మోడల్ స్కూల్ జాయింట్ యాక్షన్ కమిటీ (MS-JAC) ఆధ్వర్యం లో నాలుగో రోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సోమ వారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయం లో నిర్వహించిన ప్రజావాణిలో ఉపాధ్యాయులు పాల్గొని, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల అధి కారులకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో (MS-JAC) స్టీరింగ్ కమిటీ సభ్యుడు తరాల జగదీష్‌తో పాటు ఉపాధ్యాయులు అక్కెనేపెల్లి శ్రీనివాస్, రాజేందర్, రామకృష్ణ, శ్రీనివాస్, రాధిక, వరలక్ష్మి, అనితారాణి, శ్రీనివాస్ గౌడ్, యాదయ్య, అనిత, రాజు తదితరులు పాల్గొన్నారు.



సహజ వనరులపై మట్టి మాఫియా పంజా!

అన్నట్లుగా ఉందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. పగటిపూట సైతం యంత్రాలతో మట్టి తవ్వకాలు, రవాణా జరుగుతున్నట్లు చెబుతున్నారు. ఈ వ్యవ హారం బహిరంగంగా సాగుతున్నప్పటికీ సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మట్టి మాఫియాకు ఏటీఎంగా మారిన సీతారామ

కాలువ కట్టలు!

రైతులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మిస్తున్న ప్రతిష్టాత్మక సీతారామ ప్రాజెక్టు కాలువల పరిసర ప్రాంతాల్లోని మట్టిని ఇష్టారాజ్యంగా తవ్వి తరలిస్తున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగి స్తున్నాయి. కాలువకు ఇరువైపులా ఉండే కట్టలు, వాటి నిర్మాణానికి సంబంధించిన మట్టి తొలగిం పునకు గురైతే భవిష్యత్తులో కాలువల పటిష్టత దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కాలువ కట్టలు బలహీనపడటం, కోతకు గురికావడం, భారీ వర్షాల సమయంలో గండ్లు పడటం వంటి ప్రమాదాలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. సాగునీటి ప్రాజెక్టుల భద్రతకు సంబంధించిన అంశంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే దాని ప్రభావం చివరకు రైతులపైనే పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఖజానాకు ఆదాయం ఎక్కడ?

ప్రభుత్వ భూములు, చెరువులు, ప్రాజెక్టు పరిధిలోని మట్టిని నిబంధనలకు విరుద్ధంగా తరలించడానికి ఎవరు అనుమతులు ఇచ్చారు? అనుమతులు ఉంటే వాటి వివరాలేమిటి? ఎంత పరిమాణంలో మట్టి తవ్వకాలకు అనుమతి ఇచ్చారు? ప్రభుత్వానికి ఎంత రాయల్టీ లేదా ఇతర చట్టబద్ధమైన రుసుములు చెల్లించారు? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.నిబంధనల ప్రకారం వర్తించే అనుమతులు, రాయల్టీ, రవాణా పత్రాలు లేకుండా మట్టిని తరలిస్తే అది ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించడమే కాకుండా అక్రమ తవ్వకాల పరిధిలోకి వచ్చే అవకాశం ఉంది. మరి ఇంత పెద్దఎత్తున మట్టి తరలింపు జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖలు తనిఖీలు నిర్వహిస్తున్నాయా? రవాణా చేస్తున్న వాహనాలను పరిశీలిస్తున్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పేదలకు ఒక న్యాయం.. అక్రమార్కులకు మరో

న్యాయమా?

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం పేద కుటుంబాలు మట్టి అవసరమని అధికారులను ఆశ్రయిస్తే అనేక నిబంధనలు, అనుమతుల పేరుతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. అదే సమయంలో పెద్దపెద్ద జేసీబీలు, పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో మట్టి తరలింపు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నా అధికారులు ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.సామాన్యులకు నిబంధనలు కఠినంగా అమలవుతుంటే, భారీ స్థాయిలో మట్టి తరలిస్తున్న వారిపై మాత్రం చర్యలు ఎందుకు కనిపించడం లేదని నిలదీస్తున్నారు.

అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందా?

ఇంత బహిరంగంగా, నిరంతరాయంగా మట్టి తరలింపు జరుగుతున్నా ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ వ్యవహారం అధికారుల దృష్టికి వెళ్లలేదా? వెళ్లినా పట్టించుకోవడం లేదా? అక్రమ తవ్వకాలపై ఎవరైనా ఫిర్యాదు చేశారా? ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ వ్యవహారంలో అధికారుల ప్రమేయం ఉందనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించాలి

జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి తుమ్మలచెరువు, కొత్తూరు, సీతారామపురం,గొల్లగూడెం చింత్రాల ,బిజీ కొత్తూరు , ప్రాంతాల్లో జరుగుతున్నట్లు ఆరో పణలు ఎదుర్కొంటున్న మట్టి తవ్వకాలపై సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.ఇరిగేషన్, రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి తవ్వకాల అనుమతులు, మట్టి తరలింపు పరిమాణం, రవాణా పత్రాలు, ప్రభుత్వానికి చెల్లించిన రాయల్టీ వివరాలను పరిశీలించాలని కోరుతున్నారు.అనుమతులు లేకుండా మట్టి తరలించినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమ రవాణాకు ఉపయోగించిన వాహనాలు, యంత్రాలపై నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారుల బాధ్యతను కూడా విచారణ ద్వారా నిర్ధారించాలని కోరుతున్నారు.
ప్రజలందరికీ చెందాల్సిన సహజ వనరులు కొందరి జేబులు నింపే సాధనాలుగా మారకూడదు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడకూడదు. రైతుల భవిష్యత్తుకు కీలకమైన సీతారామ ప్రాజెక్టు భద్రత ప్రమాదంలో పడకూడదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కళ్లు తెరిచి మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తారా? లేక మట్టి మాఫియా దందా ఇలాగే కొనసాగుతుందా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

కువైట్‌లో జియాలజిస్ట్‌గా దేవరకొండ వాసి అరుదైన ఘనత!

○అంతర్జాతీయ చమురు రంగ సంస్థ హాలీబర్టన్‌లో ఉద్యోగం
○పట్టణానికి గర్వకారణంగా నిలిచిన యువకుడు

దేవరకొండ, నవంబర్ 02 (జనంసాక్షి):
కలలు కనడమే కాదు.. వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం శ్రమిస్తే అంతర్జాతీయ స్థాయిలోనూ ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని నిరూపించాడు దేవరకొండకు చెందిన యువకుడు మొహమ్మద్ అసడొద్దీన్. కువైట్‌లోని ప్రముఖ అంతర్జాతీయ చమురు రంగ సంస్థ హాలీబర్టన్ లో జియాలజిస్ట్‌గా ఉద్యోగం సాధించి దేవరకొండ పట్టణానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాడు. పట్టణానికి చెందిన మొహమ్మద్ అసడొద్దీన్..మాజీ కోఆప్షన్ సభ్యురాలు తయ్యబా ఫాతిమా..మొహమ్మద్ అలావోద్దీన్ (ఎస్ఎల్ బిసి) దంపతుల ఏకైక కుమారుడు. తన విద్యాభ్యాసాన్ని దేవరకొండలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ప్రారంభించి ఐదో తరగతి వరకు చదువుకున్నాడు. అనంతరం పెంచికల్‌పాడ్ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యను పూర్తి చేశాడు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని నవాబ్ షా ఆలం ఖాన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాలలో బీటెక్ పూర్తి చేసి, ఉన్నత విద్య కోసం యూకే వెళ్లి మాస్టర్స్ డిగ్రీని విజయవంతంగా పూర్తిచేశాడు. తన విద్యార్హతలు, పట్టుదల, నిరంతర కృషితో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన హాలీబర్టన్ సంస్థలో జియాలజిస్ట్‌గా ఉద్యోగం సాధించాడు.స్థానిక పాఠశాలలో విద్యాభ్యాసం ప్రారంభించి, హైదరాబాద్‌లో ఉన్నత విద్యను అభ్యసించి, యూకేలో మాస్టర్స్ పూర్తి చేసి, చివరకు కువైట్‌లో అంతర్జాతీయ సంస్థలో ఉద్యోగం సాధించడం విశేషం. చిన్న పట్టణం నుంచి ప్రపంచ స్థాయికి ఎదిగిన అసడొద్దీన్ ప్రయాణం నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది.తమ కుమారుడు అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగం సాధించడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అసడొద్దీన్ సాధించిన విజయంపై దేవరకొండ పట్టణ ప్రజలు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు. పట్టుదల, కృషి, నాణ్యమైన విద్య ఉంటే ప్రపంచంలో ఎక్కడైనా అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని ఆయన విజయం చాటిచెబుతోంది.

గౌడ సంఘం అధ్యక్షుని గా భాషనపల్లి మల్లయ్య గౌడ్ ఎన్నిక



నూతనకల్ నవంబర్ 2 (జనంసాక్షి)
మండల పరిధిలోని పెదనెమిల గ్రామ గౌడ సంఘం అధ్యక్షునిగా భాషనపల్లి మల్లయ్య గౌడ్ ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నిక కాబడిన భాషనపల్లి మల్లయ్య మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నన్ను అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేసి గౌడ సంఘం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌడ కుల నాయకులు గడ్డమీది వెంకటేశం,గొడిశాల రాజమల్లు, సాయిలు,గుండగాని వెంకన్న, రమేష్,గుర్రం వెంకన్న,దూసరి అబ్బయ్య, మొలుగూరి మల్లయ్య, వెంకన్న,రేసు రామస్వామి, భాషలపల్లి యాదగిరి, వెంకన్న, వీరస్వామి, తొనుకునూరి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిన్లాండ్ విద్యా పర్యటనతో కొత్త బోధనా పద్ధతులపై అవగాహన!

ఎంపీపీఎస్ దామెర భీమనపల్లి ప్రధానోపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాంకు ఘన సన్మానం

మర్రిగూడ, నవంబర్ 2 (జనంసాక్షి)
ఫిన్లాండ్ దేశంలో అంతర్జాతీయ విద్యా అధ్యయన పర్యటనను విజయవంతంగా ముగించుకొని స్వదేశానికి తిరిగి వచ్చిన మర్రిగూడ మండలం దామెర భీమనపల్లి ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాంకు ఘన సన్మానం లభించింది. సోమవారం నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశం అనంతరం మండల విద్యాశాఖ అధికారి జి. శారదతో పాటు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా ఎంఈఓ జి. శారద మాట్లాడుతూ ఫిన్లాండ్ విద్యావిధానంలో అధ్యయనం చేసిన ఉత్తమ బోధనా పద్ధతులను మన ప్రభుత్వ పాఠశాలల్లోనూ అమలు చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ పాఠశాల అభివృద్ధికి కృషి చేసి ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా లచ్చిరాం మాట్లాడుతూ ఫిన్లాండ్ విద్యావిధానం తనకు ఎన్నో కొత్త విషయాలను నేర్పిందన్నారు. అక్కడ చదువును విద్యార్థులకు భారంగా కాకుండా ఆనందంగా నేర్పించే విధానాలు అమలవుతున్నాయని తెలిపారు. ఆటలు, పాటలు, ప్రయోగాలు, ప్రాజెక్టులు, ప్రకృతి పరిశీలన ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, స్వతంత్ర ఆలోచన, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందిస్తున్నారని వివరించారు.మార్కుల కంటే విషయ పరిజ్ఞానం, ఆచరణాత్మక అభ్యసనం, వ్యక్తిగత సామర్థ్యాలకు ప్రాధాన్యత ఇవ్వడం ఫిన్లాండ్ విద్యావిధానంలోని ప్రత్యేకతగా పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు బోధనలో స్వేచ్ఛ, నూతన పద్ధతులను అనుసరించే అవకాశం కల్పిస్తున్నారని తెలిపారు. అక్కడ అధ్యయనం చేసిన ఉత్తమ విధానాలను మన ప్రభుత్వ పాఠశాలలోనూ ఆచరణలో పెట్టి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రూప్‌సింగ్, మాలతి, ప్రధానోపాధ్యాయులు అయితరాజు నాగయ్య, స్వరాజ్యం, రాజేశ్వరి, శ్రీశైలం, నాగవరం శ్రీనివాస్, రజినీకాంత్, రత్నకుమారి, రమేష్, వనజ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజావాణి

వలిగొండ, నవంబర్2 (జనం సాక్షి)
మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి, నోడల్ అధికారి జి. జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు, ఫిర్యాదులను స్వీకరించేందుకు 24 శాఖల అధికారులు అందుబాటులో ఉన్నారు. ఈ సందర్భంగా మొత్తం నాలుగు దరఖాస్తులు స్వీకరించారు. ప్రజలు సమర్పించిన అర్జీలను సంబంధిత అధికారులు పరిశీలించి, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ తగిన చర్యలు చేపట్టాలని నోడల్ అధికారి సూచించారు. ప్రజలకు ప్రభుత్వ శాఖల ద్వారా సత్వర సేవలు అందించడమే ప్రజావాణి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.



చిన్న చిన్న చిట్కాలతో విద్యుత్ వృథాను అరికట్టాలి

కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 2,(జనంసాక్షి):
ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. చిన్న చిన్న చిట్కాలను పాటించడం ద్వారా విద్యుత్ వృథాను అరికట్టవచ్చని తెలిపారు.సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెడ్కో ఆధ్వర్యంలో నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న 'సేవ్ ఎనర్జీ' కార్యక్రమంపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ప్రజలు, అన్ని వర్గాల వారిని భాగస్వాములను చేయాలని సూచించారు. సోలార్ ఎనర్జీ వినియోగం, ఈ-వేస్ట్ నిర్వహణ, విద్యుత్ ఆదా పద్ధతులపై విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా, మండల, గ్రామస్థాయిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు సూర్యరశ్మి అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో లైట్లు, ఫ్యాన్లు వినియోగించవద్దని సూచించారు. ఎయిర్ కండిషనర్ల ఉష్ణోగ్రతను 25 డిగ్రీల కంటే తక్కువగా ఉంచకుండా విద్యుత్ ఆదా చేయాలని తెలిపారు. అన్ని విద్యాసంస్థలు, పాఠశాలలు, హాస్టళ్లలో



విద్యార్థులకు విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ ఆదా చిట్కాలను విద్యార్థుల వర్క్ డైరీల్లో నమోదు చేయించాలని, తద్వారా తల్లిదండ్రులకు కూడా అవగాహన కలుగుతుందని పేర్కొన్నారు. కలెక్టరేట్‌తో పాటు జనసమ్మర్థం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో విద్యుత్ పొదుపుపై ఫ్లెక్సీలు, స్టాండీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ప్రజావాణికి హాజరైన జిల్లా అధికారులతో విద్యుత్‌ను పొదుపు చేస్తామని కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు.

బిర్సా ముండా జయంతి ఉత్సవాలు:
నవంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు బిర్సా ముండా 151వ జయంతి ఉత్సవాలను 'జనజాతీయ గౌరవ దివస్' పేరుతో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా గిరిజనుల చరిత్ర, ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలతో పాటు చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, వర్క్‌షాప్‌లు, ఎగ్జిబిషన్లు, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జనజాతీయ గౌరవ దివస్ వేడుకలకు సంబంధించిన గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు.

ప్రజావాణి ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి:
అనంతరం జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్.. 30 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులన్నింటినీ ఈ వారంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రస్తుతం జిల్లా స్థాయిలో 391, మండల స్థాయిలో 359 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఫిర్యాదులు అధికంగా ఉన్న శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఈ నెల మధ్యలో ప్రజావాణిపై ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు.

వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు:
అర్ణబ్ తుఫాను ప్రభావంతో జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిశాయని, రానున్న మాంథా తుఫాను నేపథ్యంలో మూడు, నాలుగు రోజుల్లో కురిసే వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఇందులో భాగంగా ఈ వారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో సోక్‌పిట్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టిన భూ రీ-సర్వేలో భాగంగా అన్ని శాఖల అధికారులు తమకు సంబంధించిన ప్రభుత్వ ఆస్తులను తప్పనిసరిగా ఎన్యుమరేషన్ చేయించుకోవాలని, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

పెన్షనర్ మరణిస్తే భార్యకు పెన్షన్:
పెన్షన్ పొందుతున్న వ్యక్తి మరణిస్తే అర్హత కలిగిన భార్యకు వెంటనే కుటుంబ పెన్షన్ అందేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ తెలిపారు. ఈ పథకానికి అర్హులైన వారు ఉంటే డీఆర్డీఓను సంప్రదించి దరఖాస్తు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి, డీటీడీఓ కమలాకర్ రెడ్డి, రెడ్కో ప్రతినిధి అశోక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కామేపల్లి లో ఘనంగా సమాధుల ఆశీర్వాద పండుగ

- ❑ ఆత్మల రక్షణకై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన క్రైస్తవ సోదరులు
- ❑ తల్లిదండ్రులను ప్రతి ఒక్కరు గౌరవించాలి -సత్ ప్రవర్తనతో మెలగాలి
- ❑ ఆర్ సి ఎం చర్చి ఫాదర్ జి.ప్రవీణ్ కుమార్
- ❑ తల్లిదండ్రులు చిలుముల బిక్షం - మంగమ్మ జ్ఞాపకార్థం
- ❑ పేదలకు పండ్లు పంపిణీ చేసిన కుమారులు చినుముల రమేష్.శ్రీనివాస్







కామేపల్లి, నవంబర్ 2 (జనంసాక్షి):
కామేపల్లి లో సమాధుల ఆశీర్వాద పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు.కారేపల్లి ఆర్.సి.యం చర్చి విచారణ గురువులు ఫాదర్ జి.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఉపదేశకులు శీలపాక వీరభద్రం సారధ్యంలో క్రైస్తవ సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో సాంప్రదాయ బద్ధంగా సమాధుల ఆశీర్వాద పండుగను నిర్వహించారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులు చిలుముల బిక్షం – మంగమ్మ సమాధి వద్ద వారి కుమారులు చినుముల శ్రీనివాస్, సర్వయ్య, రమేష్, వారి కుటుంబ సభ్యులు ఫాదర్ ప్రవీణ్ కుమార్ తో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఫాదర్ సమాధిని ఆశీర్వదించి వారి ఆత్మల రక్షణకై ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఫాదర్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను గౌరవించాలని కోరారు. సత్ప్రవర్తన కలిగి వారి పట్ల మర్యాదగా నడుచుకోవాల ని కోరారు.సమాధుల ఆశీర్వాద పండుగ విశిష్టతను వివరించి క్రీస్తు సందేశాన్ని ఇచ్చారు. అనంతరం చినుముల శ్రీనివాస్, సర్వయ్య, రమేష్ తమ తల్లిదండ్రులు బిక్షం – మంగమ్మ జ్ఞాపకార్థం పేదలు, దివ్యాంగులు, ఆటో డ్రైవర్లకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు చిప్పలపల్లి పుల్లయ్య, దోమల బాలశౌరి, కొర్ర పీక్లా, అజ్మీర రమేష్,అమిరిబోయిన తిరుపతయ్య, గంట సంపత్ కుమార్, పెంటయ్య,రమేష్, అభిరామ్,దివ్యాంగుల సంక్షేమ సంఘం నేత పెరుగు సైదులు, యస్నమాల రమేష్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఫాదర్ ప్రవీణ్ కుమార్ అన్ని సమాధుల వద్ద ప్రార్థనలు నిర్వహించారు.మృతుల ఆత్మ రక్షణకై ప్రార్థించి ఆశీర్వదించారు.చినుముల లక్ష్మి, క్రైస్తవ సోదరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మారేపల్లి క్రాంతి కుమార్ పటేల్ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియామకం



హాలియా నవంబర్ 2 జనంసాక్షి : మారేపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర దేవాలయ చైర్మన్ మారేపల్లి క్రాంతి కుమార్ పటేల్‌ను తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ సంఘం రాష్ట్ర నాయకత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమ రావు పటేల్ ఈ నియామకాన్ని ప్రకటించారు.ఈ సందర్భంగా మాట్లాడిన క్రాంతి కుమార్ పటేల్, తన ఎన్నికకు సహకరించిన నల్గొండ జిల్లా అధ్యక్షులు వాసుదేవుల వెంకట నర్సయ్య పటేల్, రాష్ట్ర కోశాధికారి కంచి సత్యనారాయణ పటేల్, నాగార్జునసాగర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆకుల శ్రీనివాస్ పటేల్, మన్నే కృష్ణ పటేల్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర, జిల్లా నాయకత్వం అందించిన అవకాశానికి కృతజ్ఞత తెలిపారు.

ఐక్యతకు సమావేశం నిర్వహణ

రాష్ట్ర, జిల్లా అధ్యక్షుల పిలుపు మేరకు మున్నూరు కాపు సమాజ అభివృద్ధి, సంక్షేమం కోసం విశేష కృషి చేస్తానని క్రాంతి కుమార్ పటేల్ తెలిపారు. అత్యంత త్వరలో మున్నూరు కాపుల ఐక్యతను బలోపేతం చేసేందుకు విస్తృత సమావేశం నిర్వహిస్తానని ప్రకటించారు.

సంఘం లక్ష్యాలపై దృష్టి

మున్నూరు కాపు సంఘం సమాజ అభివృద్ధి, సభ్యత్వ నమోదు, రాజకీయ మరియు సామాజిక బలోపేతానికి ప్రాధాన్యం ఇస్తోంది. రాష్ట్ర నాయకులు ప్రతి గ్రామంలో సంఘాలను ఏర్పాటు చేసి, సమాజాన్ని ఒకే వేదికపైకి తీసురావాలని పేర్కొన్నారు

కనుమరుగవుతున్న రక్త సంబంధాలు

ఆస్తి పంపకాలతో తెగిపోతున్న పేగు బంధాలు



కనగల్లు, నవంబర్3(జనం సాక్షి)
పాతకాలం పు రోజులలోఉమ్మడి కుటుంబం అంటే అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు అంతా ఒకే ఇంట్లో, ఒకే వాకిట్లో. తాతల కాలం నాటి ఇల్లు, పొలం, వారిని కలిపి ఉంచేవి. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. అదే ఇల్లు, అదే పొలం ఇప్పుడు కుటుంబాలను విడదీస్తున్నాయి. మండలంలొ దాదాపు ప్రతి గ్రామంలో ఇదే కథ. తండ్రి సంపాదించిన రెండు ఎకరాల కోసం, పాత ఇంటి స్థలం కోసం అన్నదమ్ములు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. పోలీస్ స్టేషన్లలో కేసులు, రెవెన్యూ ఆఫీసుల్లో పంచాయితీలు.పెద్దలు బతికి ఉండగానే “నా వాటా ఎంత?” అనే ప్రశ్న మొదలవుతోంది. ఆస్తి రిజిస్ట్రేషన్ పత్రం ముందు పేగు బంధం చిన్నదైపోతోంది.ఒకే కంచంలో తిన్న అన్నదమ్ములు ఇప్పుడు ఒకరి ముఖం ఒకరు చూసుకోవడం లేదు. పిల్లల పెళ్లిళ్లకు, పండుగలకు పిలుపులు లేక వీళ్ళ మధ్య ఏర్పడిన మనస్పర్థల మధ్య పేగు బంధం పంచినతల్లిదండ్రులు నలిగిపోతున్నారు. ఎవరి పక్షం ఉండాలో తెలియక మౌనంగా కన్నీరు పెడుతున్నారు .తాతల నాటి ఫోటోలు గోడలకే పరిమితం అవుతున్నాయి. గోడలకు పగుళ్లు వచ్చినట్లుగానే బంధాలకు కూడా పగుళ్లు వస్తున్నాయి.భూమి విలువ పెరగడం ఒకప్పుడు లక్ష రూపాయలు లేని భూమి ఇప్పుడు కోటి రూపాయలు కావడం,చట్టాలపై అవగాహన లేకపోవడం ,వారసత్వ చట్టం, ఆడపిల్లలకు సమాన హక్కుపై సరైన అవగాహన లేక గొడవలుమధ్యవర్తుల ప్రోత్సాహం కొందరు గొడవలను సద్దుమణిగించే బదులు రెచ్చగొట్టడం తోఆత్మీయత తగ్గడం నాదిఅనే భావన పెరిగి “మనది” అనే భావన తగ్గడం.పెద్దలు బతికి ఉండగానే వీలునామా రాయిస్తున్నారు. మనస్పర్థలు నాలుగు రోజులే ఉండాలి, కానీ రక్త సంబంధం జీవితాంతం ఉండాలి అనే సత్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.



పశువులకు తప్పకుండా నట్టల నివారణ మందులు వేయించాలి

పశువైద్యాధికారి నరేష్

నేరేడుచర్ల నవంబర్ 02 (జనంసాక్షి):
పెంచికలదిన్నె గ్రామంలో పాడి రైతుల సంక్షేమం,పశువుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఆవు దూడలకు,గేదె దూడలకు ఉచితంగా నట్టల నివారణ (డీవార్మింగ్) మందుల పంపిణీ కార్యక్రమాన్ని మండల పశువైద్యాధికారి డాక్టర్ జె. నరేష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పశువుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా క్రమం తప్పకుండా నట్టల నివారణ మందులు వేయించడం ఎంతో ముఖ్యమని,నట్టల నివారణ ద్వారా దూడల ఎదుగుదల,ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పశువుల ఉత్పాదకత పెరుగుతుందని తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న ఈ ఉచిత సేవలను పాడి రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రైతులు,ఎల్లబోయిన లింగయ్య, గంటా నాగరాజు, ప్రథమ చికిత్సాధారి స్వప్న పాల్గొన్నారు.



లోయపల్లిలో మేట్లతో సమావేశమైన సర్పంచ్, ఉపాధి హామీ సిబ్బంది

జాజిరెడ్డిగూడెం (జనం సాక్షి):
ఎల్ నినో మూలంగా ఏర్పడిన పరిస్థితుల వలస ఉపాధి హామీలో ప్రతి ఒక్కరికి పని కల్పించాలని లోయపల్లి సర్పంచ్ వల్లపు గంగయ్య కోరారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై మేట్లతో సమావేశాన్ని నిర్వహించారు. 40 మంది కూలీలకు ఒక మేట్ ఏర్పడాలని సూచించారు. జలసిరి పనులను ముమ్మరం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఈసీ మహేష్, టీఏ యాదమ్మ, కార్యదర్శి మాధవరెడ్డి, ఎఫ్ఏ సైదులు, మేట్లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మద్దిమడుగు ఆంజనేయస్వామి మాజీ చైర్మన్ పాపా నాయక్ కన్నుమూత

- ❍మద్దిమడుగు ఆంజనేయస్వామి సేవలో చిరస్మరణీయుడు.. లోటావత్ పాపా నాయక్
- ❍ఆధ్యాత్మిక సేవలకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు.. ఉస్మాన్ కుంట గ్రామానికి తీరని లోటు



చందంపేట నవంబర్ 02(జనంసాక్షి)
చందంపేట మండలం ఉస్మాన్ కుంట గ్రామానికి చెందిన లోటావత్ పాపా నాయక్ అనారోగ్యంతో సోమవారం కన్నుమూశారు మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి ఆలయంతో విడదీయలేని అనుబంధం కలిగిన ఆధ్యాత్మిక సేవామూర్తి లోటావత్ పాపా నాయక్ అస్తమించారు. స్వామివారిని కనుగొన్న వంశంలో జన్మించి, ఆ పవిత్ర క్షేత్ర విశిష్టతను బాహ్య ప్రపంచానికి పరిచయం చేయడంలో కీలక పాత్ర పోషించిన ఆయన మరణం ఉస్మాన్ కుంట గ్రామంతో పాటు మద్దిమడుగు ఆంజనేయ స్వామి భక్తుల్లో విషాదాన్ని నింపింది.ఆలయ అభివృద్ధి, నిర్వహణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన పాపా నాయక్, ఆలయ కమిటీ ఏర్పాటులో ఎదురైన సమస్యల పరిష్కారం కోసం దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు వరకు వెళ్లి న్యాయపోరాటం చేశారు. ఈ పోరాటంలో విజయం సాధించిన అనంతరం ఆలయ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి, స్వామివారి ఆలయ అభివృద్ధికి, నిర్వహణకు విశేష సేవలందించారు.నిరాడంబరత, కష్టపడే తత్వం, ఆధ్యాత్మిక చింతన ఆయన జీవితంలో అంతర్భాగాలుగా నిలిచాయి. వ్యక్తిగత జీవితానికి మించి ఆలయ సేవకే ప్రాధాన్యతనిస్తూ, స్వామివారి సన్నిధి అభివృద్ధికి నిరంతరం కృషి చేశారు. శతాధిక వయస్సులో ఆయన కన్ను మూయడం గ్రామ ప్రజలకు, భక్తులకు తీరని లోటుగా మారింది. మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయానికి ఆయన అందించిన సేవలు, ఆలయ అభివృద్ధి కోసం చేసిన కృషి, భవిష్యత్ తరాలకు అందించిన మార్గ దర్శకత్వం చిరస్మరణీయంగా నిలిచిపోను న్నాయి. ఆయన భౌతికంగా దూరమైన ప్పటికీ ఆధ్యాత్మిక సేవల రూపంలో భక్తుల హృదయాల్లో ఎప్పటికీ నిలిచిపోతారని గ్రామస్తులు, భక్తులు స్మరించుకుంటున్నారు.



హుజూర్‌నగర్‌లో ఆపరేషన్ రోప్ - రోడ్ల ఫుట్ పాతులపై ఆక్రమణల తొలగింపు

హుజూర్‌నగర్, నవంబర్ 2 (జనంసాక్షి):

పట్టణంలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పోలీసులు ఆపరేషన్ రోప్ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధాన రహదారులపై దుకాణాల ముందు రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలు, వస్తువులను తొలగించారు. రోడ్లపై సామగ్రి పెట్టడం, ఫుట్‌పాత్‌లను ఆక్రమించడం వల్ల వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఎస్‌ఐలు చలికంటి నరేష్ , హనుమాన్ నాయక్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఆక్రమణ లను తొలగించారు. దుకాణదారులు రహదారు లను ఆక్రమించకుండా వ్యాపారం చేసుకోవాలని, ఆక్రమణలకు పాల్పడితే నిరంతరం ఆపరేషన్ రోప్ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని పోలీసులు హెచ్చరించారు.



గిలకత్తుల పుల్లయ్యకు ఘన నివాళి

సూర్యాపేట(జనంసాక్షి):

నాటక సమాజాల జిల్లా అధ్యక్షుడు గిలకత్తుల పుల్లయ్య అంత్యక్రియలను సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. పుల్లయ్య మృతి పట్ల జిల్లా బాలభవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణారెడ్డి, రాష్ట్ర నాటక సమాజాల గౌరవ అధ్యక్షులు పుల్లభట్ల కృష్ణమూర్తి శర్మ, పులి కృష్ణమూర్తి, పుల్లభట్ల లక్ష్మీనారాయణ శర్మ, పరిమి రామావతారం, దుక్కి శ్రీనివాస్ శర్మ.జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు.జిల్లా సంయుక్త కార్యదర్శులు ధనియాకుల వెంకటేశ్వర్లు, పేరాల సుధీర్ సంతాపం వ్యక్తం చేశారు.అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.



ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంత ఇంటి కల సాకారం

సూర్యాపేట (జనంసాక్షి):

సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 44వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల పథకంకు ఎంపికైన లబ్ధిదారులు మద్దెబోయిన గంగోత్రి, కటికం రాణిలకు ప్రొసీడింగ్ ఫారాలను ఆ వార్డు కౌన్సిలర్ గునగంటి హేమ సతీష్ తో కలిసి మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది సోమవారం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని అన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు మంజూరయ్యేలా కృషి చేస్తామని తెలిపారు.లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలు ప్రారంభించి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయ సాధనల కోసం ఉద్యమించి పోరాడాలి

- హరిచంద్రపురంలో సీపీఐ (ఎంఎల్)మాస్ లైన్ సంస్మరణ సభ
- రెండు మండలాల సంయుక్త కార్యదర్శి ఎన్ వి రాకేష్

కామేపల్లి, నవంబరు 2 (జనంసాక్షి):



ప్రజల విముక్తి, సామాజిక అసమానతల నిర్మూలన కోసం ప్రాణత్యాగం చేసిన విప్లవ అమరవీరుల ఆశయ సాధనకు ప్రజా పోరాటాలను కొనసాగించాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ కామేపల్లి, కారేపల్లి సంయుక్త మండలాల సహాయ కార్యదర్శి ఎన్.వి. రాకేష్ పిలుపునిచ్చారు.రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కామేపల్లి మండలం హరిచంద్రపురంలో సోమవారం అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. పేదలు, కార్మికులు, రైతుల హక్కుల కోసం అమరులు చేసిన పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. సమాజంలో అన్యాయాలు, దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాస్ లైన్ నాయకులు మంగీలాల్, కిషన్, సామ్య, తస్మా, రాములు, వాగ్య నరేష్ తదితరులు పాల్గొన్నారు.



బోటిగూడెంలో వైద్య శిబిరం ఏర్పాటు

పినపాక, నవంబర్ 02 (జనం సాక్షి):

పినపాక మండల పరిధిలోని బోటిగూడెం గ్రామపంచాయతీ కేంద్రంలో వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని స్థానిక సర్పంచ్ బాపనమ్మ, ఉపసర్పంచ్ ధనలక్ష్మి ప్రారంభించారు. శిబిరంలో జ్వరంతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని వైద్యులు గ్రామస్తులకు సూచించారు. జ్వరం, ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయ కుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ ప్రసాద్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దూడల ఆరోగ్యంపై పశుసంవర్ధక శాఖ ప్రత్యేక దృష్టి

- కామేపల్లి మండలంలో సామూహిక నట్టల నివారణ కార్యక్రమం ప్రారంభం
- పశు వైద్య శాఖ అధికారి డాక్టర్ జి నాగులు

కామేపల్లి, నవంబర్ 2 (జనం సాక్షి):





మండల పరిధిలోని గోపాలపురం, రామకృష్ణాపురం గ్రామ పంచాయతీలలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామూహిక దూడల నట్టల నివారణ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఆయా గ్రామాల సర్పంచులు ముఖ్య అతిథులుగా హాజరై ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పశువైద్య అధికారి డాక్టర్ నాగులు మాట్లాడుతూ... దూడలకు సకాలంలో నట్టల నివారణ మందులు తాగించడం వల్ల వాటిలో రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఎదగడానికి, భవిష్యత్తులో అధిక పాల దిగుబడికి దోహదపడుతుందని వివరించారు. కావున మండల పరిధిలోని పాడి రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.?ఈ ప్రత్యేక శిబిరంలో మొత్తం 270 దూడలకు ఉచితంగా నట్టల నివారణ మందులు తాగించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శిరీష, వంశీ, శరత్, ధర్మ, లక్ష్మయ్యలతో పాటు పెద్ద సంఖ్యలో పాడి రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

- పట్టభద్రుల ఓటరు నమోదును ముమ్మరం చేయాలి : రేగా కాంతారావు

బూర్గంపహాడ్ నవంబర్ 02 (జనంసాక్షి)



రానున్న ఖమ్మం–వరంగల్–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి విజయానికి పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా ఓటరు నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. సోమవారం బూర్గంపహాడ్ మండలం మొరంపల్లి బంజర గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై పార్టీ ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన మండలస్థాయి సమావేశం లో ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి దిండిగాల రాజేందర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని రేగా కాంతారావు విమర్శించారు. అమలుకు సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని, ఇప్పటివరకు ఇచ్చిన హామీలను నెరవేర్చ లేకపోయిందని ఆరోపించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. ప్ర తి పట్టభద్రుడికి ఓటు నమోదు ప్రాధాన్యతను వివ రించి, ఈ ప్రక్రియను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న కార్యకర్త లకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మరో ఏడాది ఓపిక పడితే కార్యకర్తల కష్టాలు తీరుతాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, సొసైటీ మండల అధ్యక్షుడు బిక్కసాని శ్రీనివాసరావు, మాజీ బిఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, గోనెల నాని, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పం చులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

గుర్రాలపాడులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం

●అర్హులైన పేద కుటుంబాలకు కార్డుల అందజేత

●అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫామ్‌ల పంపిణీ



ఖమ్మం రూరల్, నవంబర్ 2 (జనంసాక్షి): అర్హులైన పేద కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు గుర్రాలపాడులో నూతన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి, చైర్ పర్సన్ పోకబత్తిని అనిత తో కలిసి లబ్ధిదారులకు కార్డులను అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆశీస్సులతో అర్హులైన పేద,నిరుపేద కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. నూతన కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ రేషన్ దుకాణాల ద్వారా ఉచిత సన్నబియ్యం పొందడంతో పాటు, వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు వీలుకలుగుతుందన్నారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గుర్రాలపాడు లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. చిన్నారుల విద్యాభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వారికి మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రేషన్ కార్డుల పంపిణీతో పేద కుటుంబాలకు ఆహార భద్రత మరింత చేరువ కావడంతో పాటు, చిన్నారులకు యూనిఫామ్‌ల పంపిణీ వారి సంక్షేమానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు బుర్ర మహేష్, బానోత్ ప్రసాద్, బానోత్ దివ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోర్నే సీతారాములు, 7వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కర్లపూడి భద్రకాళి, 28వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల రామ్మోహన్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది జ్యోతి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గిరిజన మహిళలకు ఏఎన్ఎం శిక్షణలో ప్రవేశాలు

ఐటీడీఏ పీవో బి రాహుల్



భద్రాచలం నవంబర్ 02 (జనంసాక్షి) ఐటీడీఏ ఆధ్వర్యంలోని భద్రాచలం ప్రభుత్వ గిరిజన మహిళా ఆరోగ్య కార్యకర్తల శిక్షణ పాఠశాలలో రెండేళ్ల ఏఎన్ఎం శిక్షణ కోర్సులో ప్రవేశాలకు అర్హులైన గిరిజన మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తెలిపారు. 2026-28 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పించనున్నట్లు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత తప్పనిసరి

అభ్యర్థులు ఇంటర్మీడియట్ అన్ని గ్రూపుల్లో ఉత్తీర్ణులై ఉండాలని, కనీస వయస్సు 17 సంవత్సరాలు ఉండాలని రాహుల్ తెలిపారు. అర్హులైన మహిళలు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు నమూనాను డౌన్‌లోడ్ చేసు కోవాలని సూచించారు. దరఖాస్తు నమూ నా, ఇతర వివరాల కోసం http://chfw.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. దరఖాస్తు రుసుము రూ.200ను డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో 'కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, తెలంగాణ, హైదరాబాద్' పేరున చెల్లించాలి. దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు పదో తరగతి, ఇంటర్మీడియట్ ధ్రువపత్రాలు, ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం లేదా నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యాభ్యాస ధ్రువపత్రాలు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, అవివాహిత ధ్రువీకరణ పత్రం, డిమాండ్ డ్రాఫ్ట్ అసలు ప్రతితోపాటు శారీరక దారుఢ్య ధ్రువ పత్రాన్ని దరఖాస్తుకు జతచేయాలి. పూర్తి చేసిన దరఖాస్తులను నవంబర్ 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు భద్రాచలం లోని గిరిజన మహిళా ఆరోగ్య కార్యకర్తల శిక్షణ పాఠశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో సమర్పించాలని ప్రాజెక్టు అధికారి కోరారు. మరిన్ని వివరాల కోసం 9490370905, 9963315323, 9000983664 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

చౌటుప్పల్ లో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం ప్రారంభం

ప్రజాస్వామ్యంలో ప్రతి పట్టభద్రుడు భాగస్వామి కావాలి

ఇ.ఎల్.వి.భాస్కర్ ఫౌండేషన్



చౌటుప్పల్, నవంబర్ 2(జనంసాక్షి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ కార్యాలయం ఎదుట వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు.పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పట్టభద్రుల ఓటు చాలా విలువైనదని, విద్యావంతులైన పట్టభద్రులే సమాజంలో మార్పుకు నాంది పలకాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఫామ్ 18 ద్వారా తమ ఓటును నమోదు చేసుకునేలా ప్రతి వార్డులో, ప్రతి గ్రామంలో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.పట్టభద్రుల ఓటరు నమోదుకు కావాల్సిన డాక్యుమెంట్లు, ఆన్ లైన్ ప్రక్రియపై కూడా అవగాహన కల్పించారు. ఈ నెలాఖరు లోపు ఎక్కువ మంది పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ 18వ వార్డు కౌన్సిలర్ బుడ్డ సురేష్, కమ్యూనిస్టు పార్టీ జిల్లా నాయకులు బోదాసు వెంకటేష్, బీజేపీ నాయకులు మార్గం శివకృష్ణ యాదవ్, తోకల సాయి కుమార్, సోముల సత్తిరెడ్డి, చేకూరి సాయిరాం, చిత్రాల రాజు, సొప్పరి లింగస్వామి, వట్టికోట వంశీ, పోలేపల్లి ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మినేపల్లి మత్స్య సహకార సంఘం అధ్యక్షులుగా నాగేంద్రబాబు ఏకగ్రీవ ఎన్నిక



కామేపల్లి, నవంబర్ 2 (జనంసాక్షి): మండలంలోని అతిపెద్ద కొమ్మినేపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన అధ్యక్షులుగా భూక్యా నాగేంద్రబాబు ఏకీగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం కొండాయిగూడెం సొసైటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్నికల అధికారి కే కిషోర్ బాబు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బండి నాగేశ్వరరావు కార్యదర్శిగా అయితనబోయిన విఠల్ రావు ఎన్నిక కాగా కమిటీ డైరెక్టర్లుగా చల్లా మల్లయ్య,మేకల కృష్ణ,బేతి వెంకటేశ్వర్లు, ధరావత్ రవి, భానోత్ గోపీచంద్ మొగిలి శ్రీను లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు నాగేంద్రబాబు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.నిరంతరం సభ్యుల సమస్యలు పరిష్కరిస్తూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కొండాయి గూడెం సొసైటీ చైర్మన్ డి హనుమంతరావు, కొమ్మినేపల్లి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు, గ్రామ పెద్దలు సొసైటీ బాధ్యులు పాటిబండ్ల ప్రసాద్,దరావత్ హరిచంద్ర, బాదావత్ నాగరాజు,జి కిషన్,ధరావత్ విన్నిబాబు, తేజవత్ శంకర్, వీర నాగులు,రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

- అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి



భద్రాచలం నవంబర్ 02 (జనంసాక్షి) ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన వివిధ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. రెవెన్యూ, భూ సమస్యలు, పింఛన్లు, సంక్షేమ పథకాలు, నిరుద్యోగుల సమస్యలు, వ్యక్తిగత సమస్యలకు సంబంధించిన వినతులను పరిశీలించి, సంబంధిత అధికారులకు పంపించారు.ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి ద్వారా నేరుగా అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారంతోపాటు అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు అవకాశం ఉంటుందని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసి, సంబంధిత శాఖాధిపతులు వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకోవాలని, ఏ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకుండా చూడాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఏఓ భగవాన్ రెడ్డి, నాయబ్ తహసీల్దార్ వినయ్ శీల శ్రీరామ్, డివిజన్ పరిధిలోని వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు

మేవా ఆర్థిక చేయూత

బూర్గంపాడ్ నవంబర్ 02 (జనంసాక్షి)

ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ ముస్లిం ఎంపవర్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ (మేవా) సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా సోమవారం రెండు నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసింది. బూర్గంపహాడ్ మండలం తాళ్లగొమ్మూరుకు చెందిన షేక్ జబ్బర్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని ఆయన కుటుంబ సభ్యులు మేవా కమిటీ దృష్టికి తీసుకురావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించారు.అదేవిధంగా పాల్వంచ మండలం కరకవాగుకు చెందిన మోబిన్ ఐటీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నారు. ఇటీవల విద్యుత్ షాక్ కారణంగా ఆయన ఇల్లు పూర్తిగా ధ్వంసం కావడంతో కుటుంబం ఇబ్బందుల్లో పడింది. ఈ విషయం తెలుసుకున్న మేవా కమిటీ రూ. 10 వేల ఆర్థిక సహాయం అందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచింది. ఈ సందర్భంగా మేవా ప్రతినిధులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ అవసరమైన వారికి సంస్థ తరఫున సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మేవా అధ్యక్షుడు మహమ్మద్ ముస్తఫా, ప్రధాన కార్యదర్శి జహీర్ పాషా, కార్యవర్గ సభ్యులు మహమ్మద్ గని, సోహెల్ పాషా, అజీజ్, సలీం, తాజుద్దీన్, హఫీజ్, ఇమ్రాన్, రఫీక్, నాగర్‌వల్లి బాబా తదితరులు పాల్గొన్నారు.



గిరిజన దర్బార్ అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

ఐటీడీఏ పీవో బి రాహుల్

భద్రాచలం నవంబర్ 02 (జనంసాక్షి):
గిరిజన దర్బార్‌లో గిరిజనులు సమర్పించే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గిరిజనుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు.సోమవారం భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ఆదివాసీ గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి ఆయన అధికారులు వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. భూ సమస్యలు, సంక్షేమ పథకాలు, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, మౌలిక వసతులు తదితర అంశాలపై గిరిజనులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ, గిరిజనుల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు గిరిజన దర్బార్ చక్కటి వేదికగా నిలుస్తోందన్నారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అర్జీల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. గిరిజనులు తమ సమస్యలకు సంబంధించిన



ఆధార పత్రాలను అర్జీలతో పాటు సమర్పిస్తే పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.

పోడు భూముల పట్టాల నుంచి విద్యుత్ సౌకర్యం వరకు
గిరిజన దర్బార్‌లో పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని, సాగు భూములకు నీటి సౌకర్యం కల్పించాలని పలువురు రైతులు కోరారు. నూతన చేపల సొసైటీల ఏర్పాటు, వ్యవసాయానికి విద్యుత్ కనెక్షన్లు, బోర్లు, మోటారు రుణాలు మంజూరు చేయాలని వినతులు సమర్పించారు. గిరిజన గ్రామాలకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. సౌర విద్యుత్ ద్వారా పంట పొలాలకు విద్యుత్ కనెక్షన్లు కల్పించడంతో పాటు ఇతర ఆర్థిక ప్రయోజనాలు అందించాలని అర్జీలు సమర్పించారు. గిరిజన దర్బార్‌లో వచ్చిన అర్జీలన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేసి, అర్హులైన వారికి విడతలవారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పీవో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఎస్‌డీసీ ఆనంద్ కుమార్, గిరిజన సంక్షేమ ఉప సంచాలకురాలు చందన, గురుకులాల ఆర్సీఓ అరుణకుమారి, గిరిజన సంక్షేమ ఈఈ మధుకర్, ఏడీఎంహెచ్‌వో సైదులు, పీవీటీజీ అధికారి గన్యా, ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల నిరసన..

అధికారులకు వినతిపత్రాలు

నడిగూడెం, నవంబర్ 3 (జనంసాక్షి):
మోడల్ స్కూల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాలు నాలుగో రోజుకు చేరాయి. ఇందులో భాగంగా నడిగూడెం మండల కేంద్రంలోని ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో సంబంధిత అధికారులకు ఉపాధ్యాయులు వినతిపత్రాలు సమర్పించారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తగిన సిఫారసులు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కరివిరాల తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొని సంఘీభావం తెలిపారు.డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని జేఏసీ ప్రతినిధులు పేర్కొన్నారు.



గొల్లూరు సత్తయ్య మృతి బాధాకరం

ఆల్ ఇండియా సమత సైనిక్ దళ్ మండల కన్వీనర్ మేదరి ప్రసాద్

కొండమల్లేపల్లి, నవంబర్ 2 (జనంసాక్షి):
కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన గొల్లూరు సత్తయ్య ఆకస్మిక మృతి బాధాకరం అని ఆల్ ఇండియా సమత సైనికళ్ మండల కన్వీనర్ మేదరి ప్రసాద్ అన్నారు. అనంతరం వారి స్వగృహానికి చేరుకొని గొల్లూరు సత్తయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కష్టకాలంలో వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ భగవంతుడు వారి కుటుంబానికి అన్ని విధాలా మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. భగవంతుడు వారి కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని అయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో అన్నపాక సంజీవ, దేరంగుల శ్రీరాములు, తాపీ మేస్త్రీలు తదితరులు పాల్గొనారు.

పిఆర్సి పై కాలయాపన తగదు

టియస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్

ఖమ్మం, (జనంసాక్షి) :



ప్రభుత్వం తెలంగాణ రెండవ పిఆర్సీ అమలుపై విపరీతమైన కాలయాపన చేస్తుందని, వెంటనే పిఆర్సి అమలు చేయాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బాలభారతి పాఠశాల నందు జరిగిన మండల 13వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పిఆర్సీ ఇవ్వకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉద్యోగ ,ఉపాధ్యాయ పెన్షనర్లు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, అసంతృప్తి తొలగాలంటే పిఆర్సీని వెంటనే ప్రకటించడం మినహా ప్రభుత్వము దగ్గర వేరే దారి లేదని తెలియజేశారు. 40 నెలల కాలంగా ఆలస్యమైన పిఆర్సీ? గతంలో ఎప్పుడూ లేదని విమర్శించారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో మీనమేషాలు లెక్కిస్తుందని, ఉద్యోగులు సమాజంలో భాగం అని గ్రహించాలని హితవు పలికారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో ఇదే విధమైన కాలయాపన చేస్తే వచ్చే ఎన్నికల్లో ఇబ్బంది ఎదుర్కొంటుందని తెలియజేశారు. ప్రభుత్వం తక్షణమే పిఆర్సీని ప్రకటించడంతోపాటు, సిపిఎస్ రద్దు చేయడం, పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల, ఉపాధ్యాయుల, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి నిర్ణీత కాలపట్టిక రూపొందించాలని డిమాండ్ చేశారు. అలాగే టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్.నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ స్కూల్ల ఏర్పాటు పేరుతో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం సరికాదని హితవు పలికారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. యాప్ ల భారం తగ్గించి, ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయాలని కోరారు. ఈ మహాసభకు షేక్ లాల్ సయ్యద్ అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి టి.శ్రీనివాస రావు, ఇందుప్రియ, షేక్ రఫీ, ప్రగతి కుమారి, ఎం.వి.చెన్నారావు, జి.ఎన్ మురళీకృష్ణ, కే.రాధ,కే. వెంకటేశ్వర్లు,ఎస్. రామారావు,బి. వెంకటేశ్వరరావు, బి.కోటేశ్వరరావు, పి. రామకృష్ణస్వామి, ఎం. స్వరాజ్యలక్ష్మి,సిహెచ్. గిరిజా రాణి,టి.పద్మ,కే. సంధ్యారాణి, ఎం.సునీత, బీవీ.రామారావు తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందుగా ఉద్యమ పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఛాయా సోమేశ్వర స్వామి దేవస్థానం రెనోవేషన్ కమిటీ నియామకానికి నోటిఫికేషన్

ఆసక్తి గల వారు 10 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలి

నల్లగొండ, నవంబర్ 2,(జనంసాక్షి):



నల్లగొండ పట్టణంలోని పానగల్‌లో ఉన్న శ్రీ ఛాయా సోమేశ్వర స్వామి దేవస్థానం రెనోవేషన్ కమిటీ నియామకానికి తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ (దేవాదాయ) శాఖ ప్రభుత్వ మెమో జారీ చేసింది.దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఉత్తర్వుల ప్రకారం ఈ నోటిఫికేషన్ విడుదలైంది. దేవస్థానం రెనోవేషన్ కమిటీలో సభ్యులుగా చేరేందుకు ఆసక్తి గల వారు నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నుంచి 10 రోజుల్లోపు నల్లగొండలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించా లని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆర్. బాలకృష్ణ తెలిపారు.పూర్తి వివరాల కోసం నల్లగొండ సహాయ కమిషనర్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

బిర్సా ముండా 151వ జయంతి వేడుకలకు శ్రీకారం

గిరిజన గ్రామాల్లో నవంబర్ 1 నుంచి 15 వరకు జనజాతీయ గౌరవ దివస్ పక్షోత్సవాలు

భద్రాచలం నవంబర్ 02 (జనంసాక్షి)
గిరిజనుల ఆత్మగౌరవం, హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పేలా జనజాతీయ గౌరవ దివస్ పక్షోత్సవాలను గిరిజన గ్రామాల్లో విస్తృతంగా నిర్వహించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సూచించారు. భగవాన్ బిర్సా ముండా 151వ జయంతిని పురస్కరించుకొని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల ప్రచార సామగ్రిని సోమవారం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జనజాతీయ గౌరవ దివస్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లు, బ్యానర్లు, కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ లోగోతో పాటు ప్రచార సామగ్రిని ఐటీడీఏ అధికారులు, ఆదివాసీ ప్రతినిధుల సమక్షంలో ప్రదర్శించి పక్షోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ నవంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే పక్షోత్సవాల్లో భాగంగా



గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, భాషలు, వారసత్వ సంపదను ప్రతిబింబించేలా వివిధ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. భగవాన్ బిర్సా ముండా ఆశయాలు, గిరిజనుల ఆత్మగౌరవం, హక్కులు, అభివృద్ధిపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ వేడుకల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. గిరిజన గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి పక్షోత్సవాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఎస్‌డీసీ ఆనంద్ కుమార్, డీడీ గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి చందన, ఆర్‌సీఓ గురుకులం అరుణకుమారి, ఈఈ మధుకర్, పీవీటీజీ అధికారి గన్యా, ఎల్‌టీఆర్ డీటీ మణిధర్, ఏడీఎంహెచ్‌వో సైదులు, ఏవో సున్నం రాంబాబు, జేడీఎం హరికృష్ణ, మేనేజర్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబోయినపల్లికి ఆర్టీసీ బస్సు ఉన్నా లేనట్టే!

మూడు నాళ్ళ ముచ్చటైన బస్సు నడపటం



కల్లూరు నవంబర్ 02(జనంసాక్షి)
విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఎర్ర బస్సు ప్రయాణం మూడునాళ్ల ముచ్చటేనా అని ఎరబోయినపల్లి విద్యార్థులు, తల్లిదండ్రులు అంటున్నారు. రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశం మేరకు మధిర డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఉదయం 8 గంటలకు చెన్నూరు నుండి ఎరబోయినపల్లి లింగాల మీదుగా కల్లూరు కు ఒక బస్సు, సాయంత్రం 4:30 కు కల్లూరు నుండి లింగాల మీదగా ఎర్రబోయినపల్లికి ఒక బస్సును నడపటానికి డిపో మేనేజర్ అంగీకరించి ఇటీవల ప్రారంభించారు. అయితే బస్సు సక్రమంగా నడవకపోవడంతో విద్యార్థులు ఉదయాన్నే లింగాల వరకు కాలినడకన అవస్థలు పడుతున్నారు , ఆర్టీసీ బస్సు నిర్ణీత సమయాలకు రావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎర్రబోయినపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినప్పటికీ, బస్సు సక్రమంగా నడవకపోవడంతో గ్రామ ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉదయం వేళల్లో కళాశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు బస్సు అందుబాటులో లేకపోవడంతో ఎర్రబోయినపల్లి గ్రామం నుంచి లింగాల వరకు కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.ప్రతిరోజూ ఉదయం కళాశాలలకు వెళ్లే విద్యార్థులు సమయానికి బస్సు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సు కోసం ఎదురు చూసినా ప్రయోజనం లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో నడుచుకుంటూ లింగాలకు చేరుకుని అక్కడి నుంచి ఇతర వాహనాల్లో ప్రయాణించాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించామని చెప్పడమే కాకుండా, ప్రతిరోజూ నిర్ణీత సమయాల్లో బస్సు నడిపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ముఖ్యంగా ఉదయం కళాశాలలకు వెళ్లే విద్యార్థుల అవసరాలను గుర్తించి బస్సు సర్వీసును క్రమం తప్పకుండా నడపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఎర్రబోయినపల్లి గ్రామానికి ఉదయం ,సాయంత్రం వేళల్లో ఆర్టీసీ బస్సును తప్పనిసరిగా నడిపించాలని గ్రామ ప్రజలు, విద్యార్థులు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.



కల్లూరు మండలం నూతన ఎంఈఓ గా పవన్ కుమార్

కల్లూరు నవంబర్ 02 (జనంసాక్షి)
మండలపరిధిలో ని ఎర్రబోయినపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐ. పవన్ కుమార్ ను కల్లూరు మండలం నూతన ఎంఈఓ గా నియమించటంతో సోమవారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టానికి వచ్చిన పవన్ కుమార్ కి ఎం ఆర్ సి సిబ్బంది సీఆర్పీలు స్వాగతం పలికి శాలువతో ఘనంగా సన్మానించారు. మండలంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ఉపాధ్యాయులు తల్లిదండ్రులు సహకారంతో కృషి చేస్తానని పవన్ కుమార్ తెలిపారు.



- కౌన్సిలర్ల హక్కులకు భంగం కలిగిం చారంటూ ఆరోపణ
- మున్సిపల్, హౌసింగ్ శాఖలపై సమగ్ర విచారణకు డిమాండ్

ఇందిరమ్మ ఇళ్లే పట్టాల పంపిణీ వివాదంపై కలెక్టర్‌కు సీపీఐ ఫిర్యాదు

ఖమ్మం రూరల్, నవంబర్ 2 (జనంసాక్షి) :
ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పీవీఆర్ గార్డెన్‌లో అక్టోబర్ 31వ తేదీన రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ సందర్భంగా చోటుచేసుకున్న వివాదంపై ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.కు సీపీఐ ఖమ్మం రూరల్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో కలెక్టర్ దివాకర టిఎస్ ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఎదులాపురం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అధికారికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీలో కాంగ్రెస్ నాయకులు వ్యవహరించిన తీరుతో కౌన్సిలర్ల హక్కులకు భంగం కలిగిందని సీపీఐ నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే కాంగ్రెస్ నాయకులు అధికారుల వద్ద నుంచి ప్రొసీడింగ్ పత్రాలు తీసుకొని పంపిణీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఎదులాపురం మున్సిపాలిటీ పర్యవేక్షణ, హౌసింగ్ శాఖ అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. వివాదానికి సంబంధించిన ఫొటోలు, వివిధ పత్రికల్లో ప్రచురితమైన వార్తా కథనాల క్లిప్పింగులను ఆధారాలుగా కలెక్టర్‌కు సమర్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని పార్టీలకు, అర్హులైన ప్రజలకు సమానంగా అందాల్సి ఉండగా, ఒకే పార్టీకి చెందిన కార్యక్రమంగా వ్యవహరిస్తూ ఇతర పార్టీల నాయకులు, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఫిర్యాదు లో పేర్కొన్నారు. సీపీఐ నాయకులు సమర్పించిన ఫిర్యాదును స్వీకరించిన కలెక్టర్, ఈ వ్యవహారంపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు మిడి కంటి చిన్న వెంకటరెడ్డి, జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కరరావు, వెంపటి సురేందర్, బానోతు రామకోటి, బూర నాగేశ్వరరావు, పగిళ్ల వీరభద్రం, బట్టు బాబు, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, ఏదులాపురం మున్సిపాలిటీ 28 వార్డు కౌన్సిలర్ దండి రంగారావు పాల్గొన్నారు

కరువు మండలంగా చింతకానిని ప్రకటించాలి

- సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన..
- 11 డిమాండ్లతో వినతిపత్రం..



చింతకాని , నవంబర్ 02 (జనంసాక్షి)
చింతకాని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంతో పాటు అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఐ చింతకాని మండల సమితి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వర్షాభావ పరిస్థితులతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో చింతకాని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. గోదావరి జలాలతో బోనకల్ బ్రాంచ్ కాలువ ద్వారా చెరువులు కుంటలు నింపాలని , రైతు భీమా పునరుద్ధరించి , యూరియా యాప్ రద్దు చేయాలనీ కోరారు.అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, వృద్ధాప్య పింఛన్లను రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్లను రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని, దళితబంధు పథకానికి గతంలో మంజూరైన రూ.15.50 కోట్లను 155 దళిత కుటుంబాలకు తక్షణమే అందించాలని కోరారు. 3,800 కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాలని, మహిళలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 ఇవ్వాలని, విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని పేర్కొన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు మాట్లాడుతూ పేదలకు తొమ్మిది రకాల నిత్యావసర సరుకులతో పాటు ప్రతి ఒక్కరికీ 12 కిలోల రేషన్ బియ్యం పంపిణీ చేయాలని, వెంకటాయపాలెం నుంచి కొదుమూరు వరకు ఉన్న 100 అడుగుల రహదారి విస్తరణను గ్రామాల్లో 50 అడుగులకు పరిమితం చేస్తూ ఇండ్లకు నష్టం కలగకుండా చేయాలని, చిన్నమండవ గ్రామంలో మున్నేరు నుంచి అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. అనంతరం 11 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున్, కూచిపూడి రవి, పార్టీ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు , జిల్లా సమితి సభ్యులు పర్చా రామచంద్రరావు, నారపోగు హేమ, మండల సహాయ కార్యదర్శిలు మార్గం శ్రీను అబ్బురి ఉమామహేశ్వరరావు బసవపురం సర్పంచ్ ఆవుల నరసింహారావు ,నాయకులు పగిడిపల్లి ఏసు దొబ్బల వెంగళరావు పదిమల్ల వెంకట నరసయ్య గోగుల ఆది గోగుల వెంకట్ హుస్సేన్ గుండ్ల బేబీ రాణి, తుపాకుల లక్ష్మీనారాయణ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి లో ఘనంగా సమాధుల పండుగ

కొవ్వొత్తులు వెలిగించి సమాధుల వద్ద ప్రార్థనలు

టేకులపల్లి, నవంబర్ 2(జనంసాక్షి):
చనిపోయి సమాధులు కాబడిన వారికి వారి వారి కుటుంబ సభ్యులు సమాధుల వద్ద ప్రత్యేక అలంకరణలు చేసి కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేసి వారి ఆత్మలు శాంతి చేకూరడం కోసం టేకులపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో సమాధుల పండుగను జరుపుకున్నారు. సులానగర్,మాలపల్లి, కోయగూడెం, ముత్యాలంపాడు ఎక్స్ రోడ్, రామచంద్రుని పేట,సంపత్ నగర్ తదితర గ్రామాల లో సమాధులు పండుగను ప్రార్థనలు చేసి ఘనంగా జరుపుకున్నారు.ఆర్.సి.యం చర్చ్ ఫాదర్‌ఆర్లయ్య,సిఎస్ఐ పాస్టర్ దగ్గుపాటి మనోహర్, సమాధుల వద్ద వాక్యాన్ని బోధిస్తూ సమాధుల పండుగ అనేది మన పూర్వీకులను, మరణించిన ఆత్మీయులను స్మరించుకునే పవిత్రమైన రోజు అని కుటుంబ సభ్యు లందరూ సమాధుల దగ్గరకు చేరుకుంటారు. సమాధు లను శుభ్రం చేసి పూలతో అందంగా అలంకరిస్తూ కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. వారి వారి కుటుంబం నుంచి దూరమైన వారి జ్ఞాపకాలను ప్రేమతో గుర్తు చేసుకుంటారు. ఈ సమాధుల పండుగ కుటుంబ బంధాలను, ప్రేమను, ఐక్యతను చాటిచెప్పే గొప్ప సంప్రదాయం ప్రతి ఏడాది ఈ ప్రత్యేకమైన రోజున జరుపుకుంటా రు.ఈ సమాధుల పండుగ కార్యక్ర మంలో కాలే ప్రసాద్ రావు,గండూరి సంజీవరావు,కాలే భాస్కర రావు, అంతోటి నాగేశ్వరరావు, ముచ్చ సుధాకర్, అంతోటి రాకేష్, కాలే అభినయ్, అంతోటి రాము, ఉల్లోజి సత్యం, తదితరులు పాల్గొన్నారు.



గిరిజన విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు
సకాలంలో అందించాలి

- ప్రతి నెల 5వ తేదీలోపు నిత్యావసర సరుకుల వివరాలు పంపించాలి
- విద్యార్థుల ఆధార్ అనుసంధానంతో ముఖ గుర్తింపు విధానంలో నమోదు చేయాలి

భద్రాచలం నవంబర్ 02 (జనంసాక్షి)

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు, యూనిఫాంలు, ఇతర మౌలిక సదుపాయాలు సకాలంలో అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి, డైరెక్టర్ బి.ఎం. సంతోష్ ఆదేశించారు. విద్యార్థులకు సంబంధించిన పూర్తి వివరాలను యాప్‌లో నమోదు చేయడంతోపాటు ఆధార్ అనుసంధానం చేసి ముఖ గుర్తింపు విధానంలో వివరాలను పొందుపరచాలని సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం నుంచి జిల్లా, విద్యాసంస్థల వారీగా అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఆశ్రమ పాఠశాల, వసతి గృహానికి అవసరమైన విద్యా సామగ్రి, నిత్యావసర సరుకుల సరఫరాకు సంబంధించి ప్రతినెల ఐదో తేదీలోపు ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులు వివరాలు పంపించాలని ఆదేశించారు. గిరిజన సహకార సంస్థతో సంబంధం లేకుండా ప్రతి విద్యాసంస్థకు అవసరమైన సామగ్రి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు అన్ని రకాల యూనిఫాంలతోపాటు ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాలు అందించేందుకు వారి బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేయించి అవసరమైన ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే ఎంఆర్‌సీ కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన 18 రకాల సామగ్రిని సరఫరా చేసినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులు మండల విద్యాశాఖ అధికారుల సహకారంతో ఆయా కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు సామగ్రి సకాలంలో అందేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు చందన, పర్యవేక్షకుడు రామకృష్ణారెడ్డి, సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.

బూరుగడ్డ దేవాలయాన్ని సందర్శించిన
ట్రైనీ ఐఏఎస్ అధికారులు



హుజూర్ నగర్ రూరల్, నవంబర్ 2 (జనంసాక్షి):

మండలంలోని బూరుగడ్డ గ్రామంలో వేంచేసియున్న శ్రీ ఆది వరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాల స్వామి, శ్రీ అనంత పద్మనాభ స్వామి, శ్రీ గోదా అమ్మ వారిని ట్రైని ఐఏఎస్ అధికారులు సోమవారం దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐఏఎస్ అధికారులను వేదమంత్రోచ్ఛారణల నడుమ శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి నాగేళ్ళ శంబిరెడ్డి, ఆలయ చైర్మన్ యరగాని బిక్షం గౌడ్, గ్రామ సర్పంచ్ యరగాని రాధా నాగరాజు, ఎంపీడీవో దేవిరెడ్డి సుమంత్ రెడ్డి, ఏపీవో శైలజ, అరుణ, పంచాయితీ కార్యదర్శులు పద్మ నాగేంద్రబాబు, నాగలక్ష్మి ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లిలో ప్రజావాణి

ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ



జాజిరెడ్డిగూడెం (జనంసాక్షి):

అర్వపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పల్లపు ఝాన్సీ, ఎంపీఓ సందీప్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చంద్రుగొండలో ఉచితంగా
పట్టభద్రుల ఓటు నమోదు

- నవంబర్ 6 వరకు అవకాశం..
- ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఎస్‌కే. వసీం పాషా ఆధ్వర్యంలో నిర్వహణ



చంద్రుగొండ, నవంబర్ 2 (జనంసాక్షి):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలో పట్టభద్రుల శాసనమండలి ఓటు నమోదు చేసుకోని అర్హుల కోసం ఉచిత ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఎస్‌కే. వసీం పాషా ఆధ్వర్యంలో నవంబర్ 2 నుంచి 6వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది.ఇప్పటివరకు పట్టభద్రుల ఓటు కోసం నమోదు చేసుకోని అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వసీం పాషా కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని సూచించారు.ఈ నమోదు కార్యక్రమం చంద్రుగొండ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నమోదుకు అవసరమైన పత్రాలు:

1. పాస్‌పోర్టు పరిమాణంలో ఫొటో 2. ఓటరు గుర్తింపు కార్డు
3. ఆధార్ కార్డు 4. పట్టభద్రత ధ్రువీకరణ పత్రం
5. సెల్‌ఫోన్ నంబరు

సంప్రదించాల్సిన నంబర్లు:

8639810884, 7893648252.అర్హులైన పట్టభద్రులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఎస్‌కే. వసీం పాషా కోరారు.

కోతుల పునరావాసానికి సింగరేణి చర్యలు తీసుకోవాలి

అడవులు పెరిగే వరకు కోతులకు ఆహారం అందించాలి

ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించిన ధన్బాద్ ఉపసర్పంచ్ ప్రేమ్ కుమార్

చుంచుపల్లి మండలం 2 నవంబర్ జనంసాక్షి

కోతులను సింగరేణి వారు దత్తత తీసుకొని వాటికి పునరావసం ఏర్పాటు చేయాలి ప్రజావాణిలో జిల్లా సబ్ కలెక్టర్, డి. పి.ఓ లకు వినతి పత్రం అందజేసిన ధన్బాద్ ఉపసర్పంచ్ భూక్య ప్రేమ్ కుమార్ .. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజావాణిలో జిల్లా సబ్ కలెక్టర్ మరియు డిపిఓ లకు సింగరేణి ఏరియాలోని ధన్బాద్, రుద్రంపూర్, గౌతమ్ పూర్ గ్రామాలలో కోతుల బెడద నివారణకై వారిని కలిసి మెమొరాండం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ధన్బాద్ ఉపసర్పంచ్ భూక్య ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ గత కొంతకాలంగా సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలో కోతులు బెడద తీవ్రతరంగా మారిందని అవి మహిళలు,పిల్లలు మరియు వృద్ధులపై దాడి చేస్తూ భయాందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. కోతులు దాడులకు దిగడానికి ముఖ్య కారణం వాటికి తిండి లేక అవి నివసించే అడవులు లేక ఇండ్లపై, ప్రజలపై దాడులు చేస్తున్నాయి. దీనికి అంతటికి కారణం సింగరేణి, ఫారెస్ట్, రైల్వే, సోలార్ ప్లాంట్ ఇలా ఈ నాలుగు విభాగాల వారు డెవలప్మెంట్ కొరకు అడవులు మొత్తం కొట్టి వేసినారు. దీనివలన అవి ప్రజలపై దాడికి తెగబడుతున్నాయి. నరికిన అడవులు మళ్లీ పెరిగే వరకు అడవిలోని చెట్లకు కాయలు పండ్లు వచ్చేవరకు వాటిని సింగరేణి వారు దత్తత తీసుకుని ప్రతిరోజు మార్కెట్ లో మిగిలిపోయిన పండ్లు కాయగూరలను కొనుగోలు చేసి కోతులకు అందించాలి అని, సింగరేణి వారు అడవులు పెంచే ప్రదేశాలలో రీహబిటేషన్స్ (పునరావాసం)సెంటర్లు ఏర్పాటు చేసి అక్కడ నిర్ణీత సమయానికి వాటికి ఆహారాన్ని ఏర్పాటు చేసి వాటిని మళ్లీ అడవిలకు అలవాటు చేసి వాటికి ప్రకృతి సిద్ధంగా పండ్లు కాయలు దొరికే వరకు సింగరేణి కోతులను దత్తత తీసుకునేలా సింగరేణి వారికి ఆదేశాలు జారీ చేయాలని . కోతులను పట్టి వదిలేయడం తాత్కాలిక సమస్య నివారణగా మారిందని శాశ్వత పరిష్కారం చేయాలని తెలియజేయడం జరిగింది.



ఢిల్లీలో ఆటో రిక్షాలో సరదాగా కాసేపు

నిరసన గళంలోనే కాదు ఆటవిడుపులోనూ ఆకర్షణగా

నిలిచినఎం ఎల్ ఏ రాగమయి దంపతులు



పెనుబల్లి, నవంబర్ 2(జనంసాక్షి)

ఓటు చోరీ వ్యతిరేక ర్యాలీలో సత్తుపల్లి నియోజకవర్గం తరపున బలమైన నిరసన వాణి వినిపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఎంఎల్ఏ డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దంపతులు ఆటవిడుపుగా ఢిల్లీలో ఆటో రిక్షాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన దృశ్యం. ఆటో రిక్షా డ్రైవర్ సీట్ లో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ కూర్చుండగా, ప్రయాణికుల సీట్ లో వరంగల్ జిల్లా సహచర ఎంఎల్ ఏ యశస్విని రెడ్డి తో, సత్తుపల్లి ఎంఎల్ఏ రాగమయి కూర్చున్న దృశ్యాన్ని కాంగ్రెస్ వర్గాలు ఆశక్తిగా తిలకిస్తున్నాయి. ఆటో పక్కనతమ ప్రధాన అనుచరుడు సత్తుపల్లి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పసుమర్తి విశ్వనాధ్.



ప్రశస్త్ తొలి దశ పరిశీలనపై
ఉపాధ్యాయులకు అవగాహన

చంద్రుగొండ, నవంబర్ 2 (జనంసాక్షి):

జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు చంద్రుగొండ మండలంలోని వివిధ యాజమాన్యాల పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రశస్త్ తొలి దశ పరిశీలనపై మండల స్థాయి అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ప్రైవేటు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, గిరిజన సంక్షేమ పాఠశాలల ఉపాధ్యాయుల కోసం పోకలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సముదాయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి ముచ్చిక సూరయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రశాస్త్ తొలి దశ పరిశీలన విధానంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పోకలగూడెం పాఠశాల సముదాయ కార్యదర్శి వి. రామకృష్ణ, వనరుల వ్యక్తులు ఎస్. శుభాకర్, డి. రంజిత్, సముదాయ వనరుల వ్యక్తి పరమేష్‌తో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పండితాపురం లోబాధిత కుటుంబాలకు పరామర్శ

కాంగ్రెస్ నేతల ఆర్థిక సాయం

సొసైటీ చైర్మన్ ధనియాకుల హనుమంతరావు



కామేపల్లి, నవంబర్ 2 (జనంసాక్షి):

పండితాపురం గ్రామంలోని పలు బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న బొమ్మగాని సైదులును పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇటీవలే మరణించిన శ్రీమతి తమిశెట్టి ఉపేంద్రమ్మ, దిండు నరమ్మల నివాసాలకు వెళ్ళి వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా కొండాయిగూడెం సొసైటీ చైర్మన్ ధనియాకుల హనుమంతరావు బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు, ఉప్పుగండ్ల వీరభద్రం, ఇంతబోయిన విటల్ రావు, నాగేశ్వరావు, చల్ల సులోమన్, దుద్దుకూరి నవీన్ కుమార్, దూగుండ్ల వీరన్న, ధరావత్ ఉపేందర్,బానోత్ శంకర్,విన్ని బాబు,కానుగుల వెంకన్న,కృష్ణ కొరవిలి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 2 (జనంసాక్షి)

భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జెండాను జిల్లా కార్యదర్శి బొడ్డు మధు, జిల్లా అధ్యక్షులు షేక్ నాగుల్ పాషా ఆవిష్కరించారు. డివిజన్ అధ్యక్షులు కూచిపూడి నరేష్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా షేక్ నాగుల్ పాషా, బొడ్డు మధు మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రత, లౌకికత్వం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం డీవైఎఫ్ఐ ఆవిర్భావం నుంచి నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. మత సామరస్యం, సామాజిక న్యాయం, సమానత్వం, సోదరభావం పెంపొందించడంలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. "మా దేహం ముక్కలైనా ఈ దేశాన్ని ముక్కలు కానివ్వం" అనే నినాదంతో దేశ ఐక్యతను కాపాడేందుకు డీవైఎఫ్ఐ కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో నిరుద్యోగం, పేదరికం, ధరల పెరుగుదల, విద్యారంగ సమస్యలు, వైద్య సదుపాయాల కొరత యువతను తీవ్రంగా వేధిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రైవేటు రంగంలో ఉద్యోగ భద్రత కల్పించాలని, యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించాలని డిమాండ్ చేశారు. విద్యను వ్యాపారంగా మార్చకుండా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఉచిత విద్య అందించాలని, పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, వసతి సదుపాయాలు సకాలంలో అందించాలని కోరారు. ప్రభుత్వాలు యువత సమస్యలను పరిష్కరించకుండా మతం, కులం, ప్రాంతం పేరుతో ప్రజల మధ్య విభజనలు సృష్టించడం సరికాదన్నారు. భగత్‌సింగ్, చేగువేరా ఆశయాలను ఆదర్శంగా తీసుకొని యువతలో శాస్త్రీయ దృక్పథం, సామాజిక బాధ్యత, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించేందుకు డీవైఎఫ్ఐ కృషి చేస్తోందని తెలిపారు. మూఢనమ్మకాలు, మత విద్వేషాలు, కుల వివక్ష, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా యువత చైతన్యవంతంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. డీవైఎఫ్ఐ యువజన, విద్యార్థి, నిరుద్యోగుల హక్కుల కోసం అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించిందని నాయకులు గుర్తుచేశారు. యువతకు ఉపాధి, విద్య, ఆరోగ్యం, క్రీడలు, సాంస్కృతిక అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తోందన్నారు. యువత తమ సమస్యలను వ్యక్తిగత సమస్యలుగా కాకుండా సామాజిక సమస్యలుగా గుర్తించి సంఘటితంగా పోరాడాలని సూచించారు. ఈ సందర్భంగా ఖమ్మం డివిజన్ కార్యదర్శి రావులపాటి నాగరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం, రాజ్యాంగ విలువలను పరిరక్షించడం, దేశ లౌకిక స్వభావాన్ని కాపాడడం ప్రతి యువకుడి బాధ్యత అని అన్నారు. నిరుద్యోగం, విద్యా సమస్యలు, సామాజిక అసమానతలు, మాదకద్రవ్యాల వ్యసనం, మహిళలపై హింస వంటి సమస్యలపై రాబోయే రోజుల్లో మరింత విస్తృతంగా ఉద్యమాలు చేపడతామని తెలిపారు. డీవైఎఫ్ఐ 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని యువత పెద్ద సంఖ్యలో సంఘంలో చేరి ప్రజా సమస్యలపై జరిగే పోరాటాల్లో భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు షేక్ నాగుల్ పాషా, ఉపాధ్యక్షులు రావులపాటి నాగరాజు, జిల్లా సహాయ కార్యదర్శి కూచిపూడి నరేష్, డివిజన్ నాయకులు ఇనపనూరి వర్షిత్, సురేందర్, సుమన్, ఉపేందర్, గోపి, సాయి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.





జాతీయ స్థాయి కరాటే పోటీల్లో

సర్వజ్ఞ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం, (జనంసాక్షి) :

32వ జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్‌లో సార్వజ్ఞ ది న్యూ జెన్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలతో సత్తా చాటారు. బంగారు, వెండి పతకాలు సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. సుమన్ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే-డో అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో నవంబర్ 1న ఖమ్మంలో నిర్వహించిన ఈ జాతీయ స్థాయి పోటీల్లో పలు విభాగాల్లో పోటీపడిన సార్వజ్ఞ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. బంగారు పతకాలు సాధించిన వారు: బి. రితిక, ఆర్. బృహతి, కె. రుత్విక (అండర్-12 విభాగం), పి. మౌనిష్ (అండర్-14 విభాగం). వెండి పతకాలు సాధించిన వారు: బి. అఖిర, నవ్య అగర్వాల్ (అండర్-12 విభాగం). ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని అన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పాఠశాల డైరెక్టర్ నీలిమ విజేతలను అభినందిస్తూ.. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయంపై పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసి విజేతలకు అభినందనలు తెలియజేశారు.



ఖమ్మం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

అఖిల భారత ఐక్య రైతు సంఘం డిమాండ్

ఖమ్మం కార్పొరేషన్ నవంబర్ 2 (జనంసాక్షి)

అఖిల భారత ఐక్య రైతు సంఘం ఖమ్మం జిల్లా కమిటీ సమావేశం సంఘం అధ్యక్షులు మలీదు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం సీనియర్ నాయకులు గుర్రం అచ్చయ్య, రాష్ట్ర కోశాధికారి ఆవుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులను భయభ్రాంతులకు గురి చేస్తోందని, వ్యవసాయం చేయకుండా క్రాప్ హాలిడే ప్రకటించే విధంగా రైతాంగాన్ని పురికొల్పుతోందని విమర్శించారు. కరువు సహాయక చర్యలు చేపట్టకుండా తన బాధ్యత నుండి తప్పించుకో చూస్తోందని, కరువు వలన నష్టపోతున్న రైతాంగం వారు చేసిన వ్యవసాయం వల్లనే నష్టపోయారని రైతుల మీదనే నెపం వేయడానికి ప్రయత్నిస్తోందని అన్నారు.

సమావేశంలో చేసిన డిమాండ్లు:

ప్రభుత్వం బాధ్యత వహించి రబీ సీజన్ లో వ్యవసాయాన్ని కాపాడాలి. అందుకు అవసరమైన తక్కువ నీటితో పండే పంటలు - కంది, పెసర, శనగలు, మినుములు, జొన్న తదితర విత్తనాలను, రైతాంగానికి అవసరమైన ఎరువులను యుద్ధ ప్రాతిపదికన సరఫరా చేయాలి. ఉన్న పంటలను కాపాడటానికి వ్యవసాయానికి 9 గంటలు తగ్గకుండా, కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలి. ఖరీఫ్ లో పంట నష్టపోయిన రైతాంగానికి ఆహార పంటలకు ఎకరానికి రూ. 50,000/-, వాణిజ్య పంటలు, కూరగాయ పంటలకు ఎకరాకు రూ. లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలి. రైతాంగం అన్ని రకాల రుణాలను మాఫీ చేసి, కొత్త రుణాలు మంజూరు చేయాలి. ఖమ్మం జిల్లా కరువు నివారణకు సీతారాం ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి, భక్త రామదాసు, మంచుకొండ ఎత్తిపోతల పథకాలను ఆయకట్టు వరకు విస్తరించాలి.

ప్రజలకు అవసరమైన నిత్యావసరాలను రేషన్ షాపుల ద్వారా సబ్సిడీపై అందించాలి.

ఈ సమావేశంలో ఐక్య రైతు సంఘం జిల్లా కార్యదర్శి కోలేటి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు కొమ్మి కోమటి నాగేశ్వరరావు, గుగులోత్ తేజ్ నాయక్, సహాయ కార్యదర్శులు పాశం అప్పారావు, కుర్రా వెంకన్న, కోశాధికారి కేడోతు లక్ష్మణ్, సభ్యులు బానోత్ శంకర్, ధరావత్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ ఎం ప్రసాద్ కి ఇండియన్ గ్లోరీ అవార్డు

○30 ఏళ్ల నృత్య ప్రస్థానానికి గుర్తింపు ○నటుడు సుమన్ చేతుల మీదుగా జ్ఞాపిక అందజేత

ఖమ్మం, (జనంసాక్షి) :

నృత్యాన్ని తన శ్వాసగా, తన జీవితంగా మలచుకుని 30సంవత్సరాలుగా నిర్విరామంగా నృత్య రంగంలో సేవలందిస్తున్న నృత్య దర్శకులు, ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల సాంస్కృతిక అధ్యాపకుడు ఆర్ఎం ప్రసాద్ కి ప్రతిష్టాత్మక ఇండియన్ గ్లోరీ అవార్డు లభించింది. కళారత్న మూవీస్, రాజు ఎంటర్టైనర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాదులో నిర్వహించిన కార్యక్రమంలో సినీ నటుడు సుమన్ ఆర్ఎం ప్రసాద్ కు ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా నటుడు సుమంత్ తో పాటు పలువురు ప్రముఖులు మాట్లాడుతూ మూడు దశాబ్దాల పాటు ఎంతో మంది ఔత్సాహిక కళాకారులను తీర్చిదిద్దుతూ వేలాది మంది విద్యార్థులకు నృత్యంలో మెళకువలు నేర్పించారన్నారు. కళా రంగానికి ఆయన చేసిన కృషి నీ కొనియాడారు. డాన్స్ అంటే కేవలం స్టెప్పులు మాత్రమే కాదని అది ఒక క్రమశిక్షణ, ఒక సంస్కారం అని తన శిష్యులకు నిరూపించారన్నారు. ఎన్నో వేదికలపై తనదైన ముద్ర వేసి ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్న ప్పటికీ ఈగ్లోరీ అవార్డు ఆయన 30 ఏళ్ల సుదీర్ఘ కళా ప్రయాణానికి దక్కిన గొప్ప గుర్తింపు అని అభినందించారు. కష్టపడి పనిచేస్తే కళ ఎప్పటికైనా గుర్తిస్తుందని ఆయన నిరూపించారన్నారు. రాబోయే రోజుల్లో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మరెంతో మంది కళాకారులను తయారు చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆర్ ఎం ప్రసాద్ ను వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటులు సుమన్, సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, వివిఎన్ ఆదిత్య, సినీ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, హాస్యనటులు జెన్నీ, వందే భారత్ దర్శకులు, ప్రముఖ మిమిక్రీ కళాకారులు మల్లం రమేష్, నటుడు, దర్శకులు, మెజీషియన్ రామదుగు వసంత కుమార్, కమెడియన్ యాంకర్ మొగిలి తదితరులు పాల్గొన్నారు.



ప్రియదర్శిని విద్యాసంస్థల అభినేత

నవీన్ బాబు అభినందనలు...

30 సంవత్సరాలుగా విద్యార్థులకు నృత్యాలు నేర్పిస్తూ ఎన్నో అవార్డులు రివార్డులు సాధించిన తమ కళాశాల కల్చరల్, డాన్స్ మాస్టర్ ఆర్ఎం ప్రసాద్ కు ఇండియన్ గ్లోరీ అవార్డు- 2026 రావడం అభినందనీయమని ప్రియదర్శిని విద్యా సంస్థల అధినేత డాక్టర్ కె నవీన్ బాబు అన్నారు. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అవార్డు గ్రహీత ఆర్ ఎం ప్రసాద్ ను నవీన్ బాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి గోపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా నవీన్ బాబు మాట్లాడుతూ 30సంవత్సరాలుగా విద్యార్థులకు డాన్స్ నేర్పిస్తూ ఎన్నో అవార్డు తెచ్చి ఖమ్మం ఖ్యాతిని తెలంగాణలో నెంబర్ వన్ గా చేసినందుకుగాను ఆర్. యన్.ప్రసాద్ కి ఈ అవార్డు దక్కినందన్నారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించడంతో పాటు జాతీయస్థాయిలో గుర్తింపు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- తుపాను ఎఫెక్ట్ తో సూర్యాపేట జిల్లాకు హైఅలర్ట్
- నేటి మధ్యాహ్నం వరకు ప్రయాణాలు బంద్ చేసుకోవాలి
- అధికారులతో అత్యవసర సమావేశంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట (జనంసాక్షి):
బంగాళాఖాతంలో ఏర్పడుతున్న తుపాను ప్రభావం సూర్యాపేట జిల్లాపై ఉండే అవకాశం ఉందని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. జిల్లాలో బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసినట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో పాటు క్షేత్రస్థాయి సిబ్బందితో కలెక్టర్ అత్యవసర వెబెక్స్ సమావేశం నిర్వహించారు. తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.తుపాను ప్రభావంతో జిల్లాలో గాలుల వేగం క్రమంగా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.నేటి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని సమావేశంలో వివరించారు. తుపాను తీరం దాటే ప్రభావం జిల్లాపై పడే అవకాశం ఉన్నందున ముఖ్యంగా దక్షిణ, నైరుతి ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు.తుపాను ప్రభావం నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు ప్రయాణాలు చేయొద్దని సూచించారు.నేటి మధ్యాహ్నం 12 గంటల వరకు ద్విచక్ర వాహనాలు, కార్లు, భారీ వాహనాల రాకపోకలను వీలైనంత వరకు నిలిపివేయాలన్నారు.చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగులు, ప్రమాదకర నిర్మాణాల దగ్గర ఉండొద్దని హెచ్చరించారు.లోతట్టు ప్రాంతాలు, వరద ముంపు గ్రామాలు, బలహీనమైన భవనాలను గుర్తించి అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు.వాగులు, వంకలు, బ్రిడ్జిలు,కాజ్‌వేలపై వరద ప్రవాహం ఉంటే రాకపోకలను నిలిపివేయాలని చెప్పారు.విద్యార్థుల భద్రత దృష్ట్యా సోమవారం మధ్యాహ్న భోజనం తర్వాత స్కూళ్లకు సెలవు ప్రకటించి పిల్లలను ఇళ్లకు పంపించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.

24 గంటలు అందుబాటులో అధికారులు...
రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్, మున్సిపల్, పంచాయతీరాజ్, వైద్య, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.రిజర్వాయర్లు, చెరువులు, కట్టలు, కాల్వల నీటిమట్టాలను ఇరిగేషన్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాల న్నారు.విద్యుత్ అంతరాయాలు ఏర్పడితే వెంటనే పునరుద్ధరించేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.రోడ్లపై చెట్లు కూలిన, వరదలతో రాకపోకలకు అంతరాయం కలిగినా వెంటనే స్పందించేందుకు జేసీబీలు, ఇసుక బస్తాలు, ఇతర సామగ్రిని సిద్ధంగా ఉంచాలన్నారు.ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్ బృందాలు కూడా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.జిల్లాలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి కీలక శాఖ నుంచి ఒక అధికారిని కంట్రోల్ రూమ్‌లో 24 గంటల పాటు అందుబాటులో ఉంచాలని సూచించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నేటి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రతి గంటకు పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.ఫోన్ నెట్‌వర్క్, ఇంటర్నెట్ సేవలకు అంతరాయం ఏర్పడితే పోలీస్ కమ్యూనికేషన్ వ్యవస్థ ద్వారా సమాచారాన్ని జిల్లా కేంద్రానికి చేరవేయాలని సూచించారు.తుపాను వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో ఎస్పీ కె.నరసింహ, అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, డీఈఓ శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ డిడి శ్రీనివాసరావు, డిఎస్ఓ మోహన్ బాబు, ఆర్టీవో పురుషోత్తం రెడ్డి, డిఐఈఓ సులోచన రాణి, ఆడిట్ ఆఫీసర్ శ్యామ్, డిటిడిఓ, ఇరిగేషన్, ఫైర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నల్గొండలో 34 మంది బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ.శరత్ చంద్ర పవార్

నల్లగొండ ప్రతినిధి,నవంబర్ 2,(జనం సాక్షి):
ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే స్పందించాలని, బాధితులకు చట్టపరంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ఆదేశించారు.సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధి నుంచి వచ్చిన సుమారు 34 మంది బాధితుల సమస్యలను ఎస్పీ స్వయంగా విన్నారు.వారి ఫిర్యాదులను స్వీకరించి, సమస్యలకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, మోసాలు, ఆస్తి సంబంధిత వివాదాలు తదితర అంశాలపై బాధితులు ఎస్పీకి ఫిర్యాదులు అందజేశారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ, సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను నిర్ధారించిన అనంతరం చట్టపరమైన నిబంధనల ప్రకారం సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితులకు న్యాయం అందించే విషయంలో ఎలాంటి జాప్యం చేయవద్దని, ప్రతి కేసు పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖను ఆశ్రయిస్తారని, అలాంటి వారి ఫిర్యాదులను గౌరవంగా స్వీకరించి నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ఎస్పీ తెలిపారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.పోలీస్ గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా జిల్లా ఎస్పీని కలిసి తమ సమస్యలను వివరించే అవకాశం కల్పిస్తున్నామని, ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించి చట్ట పరిధిలో సత్వర పరిష్కారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు.

మారేపల్లి క్రాంతి కుమార్ పటేల్ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియామకం



హాలియా నవంబర్ 2 జనంసాక్షి
మారేపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర దేవాలయ చైర్మన్ మారేపల్లి క్రాంతి కుమార్ పటేల్‌ను తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ సంఘం రాష్ట్ర నాయకత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమ రావు పటేల్ ఈ నియామకాన్ని ప్రకటిం చారు. ఈ సందర్భంగా మాట్లాడిన క్రాంతి కుమార్ పటేల్, తన ఎన్నికకు సహకరించిన నల్గొండ జిల్లా అధ్యక్షులు వాసుదేవుల వెంకట నర్సయ్య పటేల్, రాష్ట్ర కోశాధికారి కంచి సత్యనారాయణ పటేల్, నాగార్జునసాగర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆకుల శ్రీనివాస్ పటేల్, మన్నే కృష్ణ పటేల్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర, జిల్లా నాయకత్వం అందించిన అవకాశానికి కృతజ్ఞత తెలిపారు.

ఐక్యతకు సమావేశం నిర్వహణ
రాష్ట్ర, జిల్లా అధ్యక్షుల పిలుపు మేరకు మున్నూరు కాపు సమాజ అభివృద్ధి, సంక్షేమం కోసం విశేష కృషి చేస్తానని క్రాంతి కుమార్ పటేల్ తెలిపారు. అత్యంత త్వరలో మున్నూరు కాపుల ఐక్యతను బలోపేతం చేసేందుకు విస్తృత సమావేశం నిర్వహిస్తానని ప్రకటించారు.

సంఘం లక్ష్యాలపై దృష్టి
మున్నూరు కాపు సంఘం సమాజ అభివృద్ధి, సభ్యత్వ నమోదు, రాజకీయ మరియు సామాజిక బలోపేతానికి ప్రాధాన్యం ఇస్తోంది. రాష్ట్ర నాయకులు ప్రతి గ్రామంలో సంఘాలను ఏర్పాటు చేసి, సమాజాన్ని ఒకే వేదికపైకి తీసురావాలని పేర్కొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటర్ల హెల్ప్ డెస్క్ ప్రారంభం



మాడుగులపల్లి నవంబర్ 2 (జనం సాక్షి):
నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు, ఇతర సందేహాల నివృత్తి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ను తహసీల్దార్ సరోజ పావని ప్రారంభించారు ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా, నమోదు లేదా ఇతర సాంకేతిక సందేహాలు ఉన్నవారు తహసీల్దార్ కార్యాలయంలోని హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి తమ అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారుఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, కార్యాలయ సిబ్బంది ఉపేందర్, జి పి ఓ లు పెద్దమాం శ్రీనివాస్, వెంకటయ్య, సతీష్, కంప్యూటర్ ఆపరేటర్ నాగేందర్, తహసీల్దార్ కార్యాలయ రెవెన్యూ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) పాదయాత్రకు ప్రజాదరణ

రెండవ రోజు కొనసాగిన సీపీఐ(ఎం) పాదయాత్ర



సంస్థాన్ నారాయణపురం నవంబర్ 2 (జనం సాక్షి):
శివన్నగూడెం ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని,రాచకొండ ఎత్తి పోతల పథకానికి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) నారాయణపురం మండల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రను గ్రామాల్లో ప్రజలు సానుకూలంగా ఆదరిస్తున్నారు. ఆదివారం శివన్నగూడెం ప్రాజెక్టు నుంచి ప్రారంభించిన పాదయాత్ర రెండవ రోజు సోమవారం మండలంలోని సాయిగొనిబావి మీదగా లింగంవారిగూడెం,. గుజ్జలో,. మల్లారెడ్డిగూడెం, సర్వేలు, నాగంవారిగూడెం గ్రామాల మీదగా అల్లందేవిచెరువు చేరుకున్న పాదయాత్రకు దోనూరు నర్సిరెడ్డి, గుండు లింగస్వామి,గుండు లింగయ్య, సుధాకర్,సుర్వి వెంకటేష్,శేఖర్,జె.విష్ణు,జి.పాండు, రమేష్,జనగల నరసింహ,బద్దం జెన్నారెడ్డి, నర్సిరెడ్డి, రామాంజనేయ, దశరథ, జంగయ్య, వెంకటయ్య, అంజయ్య,భిక్షపతి లతోపాటు అన్నవరం మహిళలు బతుకమ్మలతో స్వాగతం పలికారు. చిమిర్యాలలో సురవి కిరణ్, దుర్గా రెడ్డి, రంగారెడ్డి, కృష్ణమూర్తి, దౌల జంగయ్య, విశ్వనాథ చారి, వెంకటేష్ హరికృష్ణ లతోపాటు పలువురు మహిళలు బోనాలు బతుకమ్మలతో స్వాగతం పలికారు.శేరిగూడెంలో దోనూరు హంసకల,తుమ్మల వసంత,సుర్కంటి సుమతమ్మ,కడ్తాల భిక్షం,తుమ్మల శ్రీనివాస్ రెడ్డి, గుంటోజు సుదర్శన చారి, తుమ్మల నర్సిరెడ్డి, బద్దం నర్సిరెడ్డి పూలమాలలు వేసి బతుకమ్మలతో స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో పాదయాత్ర బృందం నాయకులు సుర్కంటి శ్రీనివాస్ రెడ్డి,తుమ్మల నర్సిరెడ్డి, గుంటోజు శ్రీనివాసచారి,మల్లెపల్లి లలిత,దోడ యాదిరెడ్డి,అయితరాజు గాలయ్య, ఆరుట్ల రాజు,కుక్కుడాల మంగమ్మ,కేసాని కృష్ణ,దోతగోని శంకరయ్య,ఉప్పలపల్లి బాలకృష్ణ,గుండు జంగయ్య, వెలిజాల సుందరయ్య,జెనిగల యాదయ్య,దోడ భరత్ రెడ్డి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దోనూరు నర్సిరెడ్డి, సీనియర్ నాయకులు దొంతగోని పెద్దలు, పిట్ట రాములు,చాడ నరసింహ,బొమ్మగోని శంకరయ్య, చింతకాయల నరసింహ,శివశటి లాలయ్య, వర్కాల చంద్రశేఖర్,కేసిరెడ్డి యాదవ రెడ్డి,సురవి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కంకర తేలిన రోడ్డుకు బీటీ దారి ఎప్పుడు?

అజ్జలాపురం-నర్సింహపురం లింకు రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని ఎమ్మెల్యేకు వినతి

మర్రిగూడ, నవంబర్ 2 (జనం సాక్షి)

మర్రిగూడ మండలం అజ్జలాపురం నుంచి నర్సింహపురం మీదుగా నర్సింహపురం గేటు ప్రధాన రహదారి వరకు ఉన్న లింకు రోడ్డు పూర్తిగా కంకర తేలిపోయి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారిందని, వెంటనే బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని డా. మోగావత్ చందు నాయక్ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు.ఏళ్ల తరబడి రహదారి సమస్యతో రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు అధ్వానంగా ఉండటంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకునే పరిస్థితి నెలకొందని చందు నాయక్ పేర్కొన్నారు. 2018 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన రహదారి అభివృద్ధి హామీని నెరవేర్చాలని కోరారు.

ఈ మార్గం ద్వారా సుమారు 300 మంది విద్యార్థులు, ప్రజలు నల్లగొండ, మాల్, ఇబ్రహీంపట్నం, హైదరాబాద్ ప్రాంతాలకు విద్య, ఉద్యోగ, ఇతర అవసరాల కోసం రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. రవాణా సౌకర్యం సరిగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడుస్తున్నా తమ గ్రామానికి సరైన రహదారి సౌకర్యం అందకపోవడం విచారకరమని, రెండు గ్రామాల చిరకాల స్వప్నమైన బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జగన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆగమోత్కూరు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో 10 అక్రమ బోర్లు గుర్తింపు!

- ○జనంసాక్షి వార్తకు తక్షణమే స్పందించిన రెవెన్యూ అధికారులు
- ○క్షేత్రస్థాయిలో పరిశీలించిన రెవెన్యూ బృందం అధికారుల చర్యలపై హర్షం
- ○ఆక్రమణలను తొలగించి, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్

మాడుగులపల్లి, నవంబర్ 2 (జనంసాక్షి):

మాడుగులపల్లి మండలం ఆగమోత్కూరు గ్రామ రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 629 ప్రభుత్వ చెరువు శికం భూమిలో అక్రమాలు జరుగుతున్నాయంటూ జనంసాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ యంత్రాంగం తక్షణమే స్పందించింది తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సోమవారం క్షేత్రస్థాయి పరిశీలనకు ఆగమోత్కూరు చెరువు వద్దకు వెళ్లారు ఈ తనిఖీల్లో సర్వే నంబర్ 629లోని చెరువు ఎఫ్‌టీఎల్ (ఈఒ) పరిధిలో ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా అక్రమంగా దాదాపు 10 బోరుబావులు తవ్వినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు ప్రభుత్వ శికం భూముల్లో అనుమతులు లేకుండా బోర్లు తవ్వడం చట్టరీత్యా నేరమని, వీటిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు



కబ్జాకోరులను నిలదీసిన కోయలపాడు వాసులు

కాగా, చెరువు శివారు భూములను అక్రమంగా చదును చేస్తూ పొలాలుగా మారుస్తున్న వ్యవహారాన్ని గమనించిన పొరుగు గ్రామమైన కోయలపాడు నివాసితులు అక్రమణ యత్నాలను గట్టిగా నిలదీశారు ఆగమోత్కూరు శివారులోని ఈ చెరువు నిండితే ఆగమోత్కూరుతో పాటు కోయలపాడు రెవెన్యూ పరిధిలోని పంట పొలాలకు నీరు అందుతుందని, అలాంటి నీటి వనరును ఆక్రమించుకోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు చెరువు భూములు కబ్జాకు గురికావడంతో మూగజీవాలు మేతకు వెళ్లేందుకు దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికే దయల్ 100 ద్వారా వేములపల్లి పోలీసులకు కంప్లైంట్ చేశామని, అధికారులు స్పందించి శాశ్వతంగా ఆక్రమణలను తొలగించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన బాట పడతామని కోయలపాడు గ్రామస్తులు హెచ్చరించారు

జనంసాక్షికి, అధికారులకు గ్రామస్తుల ధన్యవాదాలు

ప్రజా సమస్యపై కథనాన్ని ప్రచురించి యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లిన జనంసాక్షి పత్రికకు, అలాగే వెంటనే స్పందించి క్షేత్రస్థాయికి వచ్చి అక్రమ బోర్లను గుర్తించిన రెవెన్యూ అధికారులకు ఆగమోత్కూరు, కోయలపాడు గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు చెరువు శికం భూముల ఆక్రమణలపై పూర్తిస్థాయి జాయింట్ సర్వే నిర్వహించి, కబ్జాలో ఉన్న భూములను స్వాధీనం చేసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు.

బియ్యం ధరలకు కళ్లెం వేయాలి

○ రూ.38కే సన్నబియ్యం విక్రయించాలి

○జాగృతి వినియోగదారుల సంఘం డిమాండ్

చండూరు, నవంబర్ 2 (జనంసాక్షి)

తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో కొందరు అక్రమ వ్యాపారులు నిత్యావసర వస్తువులను, ముఖ్యంగా సన్నరకం బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని చండూరు మండలం జాగృతి వినియోగదారుల సంఘం ఆర్డీవో శ్రీదేవికి వినతి పత్రం ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో బియ్యం ధర రూ.70 నుంచి రూ.80 వరకు పలుకుతోందని, రానున్న రోజుల్లో రూ.100 నుంచి రూ.150 వరకు పెరిగే అవకాశం ఉందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోందని పేర్కొంది. పెరుగుతున్న బియ్యం ధరలను నియంత్రించి ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు నల్లగొండ జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలు, నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలోని రైతు బజార్లలో సన్నరకం బియ్యం విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సంఘం కోరింది. ప్రతి ఆధార్ కార్డుపై 10 కిలోల వరకు కిలో బియ్యం రూ.38 చొప్పున విక్రయించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అధిక ధరల భారాన్ని తగ్గించి వినియోగదారులను ఆదుకోవాలని చండూరు మండలం జాగృతి వినియోగదారుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.ఈ కార్యక్రమంలో జాగృతి వినియోగదారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు తిరందాసు ఆంజనేయులు, ఉపాధ్యక్షులు గండూరి నర్సింహ్మ, కార్యదర్శి తాందారి యాదయ్య, సహాయ కార్యదర్శి జూలూరి వెంకటేశం, కోశాధికారి గంజి వెంకటేశం, సభ్యులు తిరందాసు నందు, మహిళా సభ్యులు ఎర్రజెల్ల శైలజ, కారింగు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



హాలియా మున్సిపాలిటీ విధానాలపై బీఆర్ఎస్ ఆగ్రహం

నోముల భగత్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో

హాలియా, జనం సాక్షి నవంబర్ 2:

హాలియా మున్సిపాలిటీ చైర్మన్, కమిషనర్ విధానాలను తీవ్రంగా నిరసిస్తూ నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం కోదాడ?జడ్చర్ల జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. హాలియా పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేసిన కార్యకర్తలు, రాస్తారోకోతో హైవేపై ట్రాఫిక్కు అంతరాయం కలిగింది



నాలుగో వార్డుపై వివక్ష ఆరోపణ

బీఆర్ఎస్ ప్రాతినిధ్యం వహిస్తున్న నాలుగో వార్డుకు గత ఏడాదిగా అభివృద్ధి నిధులు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడాన్ని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌జీ తీవ్రంగా విమర్శించారు. మున్సిపల్ చైర్మన్, కమిషనర్ బీఆర్ఎస్ కౌన్సిలర్‌ను అవమానిస్తూ పార్టీ ప్రాతినిధ్య వార్డును విస్మరిస్తున్నారని ఆయన ఆరోపించారు.నాలుగో వార్డు ప్రజలు చెల్లించే పన్నులు మున్సిపాలిటీకి అవసరం లేదా? ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధి వార్డుకు నిధులు ఇవ్వకుండాజీ అభివృద్ధిని అడ్డుకోవడం ప్రజాపాలనా అని భగత్ ప్రశ్నించారు. జనరల్ స్థానం నుంచి గెలిచిన కౌన్సిలర్ కడమంచి ప్రమీల శ్రీనివాస్‌పై వివక్ష చూపుతున్నారని, ఇది బలహీన వర్గాలను రాజకీయంగా అణచివేసే దుర్భావనగా విమర్శించారు.

ఇందిరమ్మ ఇండ్ల మంజూరుపై ఆరోపణలు

ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో కమిషనర్ అవకతవకలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఇళ్లు ఉన్నవారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నారని, అర్హులైన నిజమైన లబ్ధిదారులుజీ వంచితులవుతున్నారని వారు విమర్శించారు.

అలాగే, టీయూఎఫ్ఐడీసీ నుంచి హాలియా మున్సిపాలిటీకి రూ. 3.8 కోట్ల నిధులు వస్తే, వాటిని కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహిస్తున్న 11 వార్డుల్లోనే ఖర్చు చేస్తున్నారని భగత్ ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో అన్ని పార్టీల వార్డులకూ నిధులు విడుదల చేసినట్లు పేర్కొంటూ, ప్రస్తుత పాలకవర్గం పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు.

అవినీతిపై కఠిన హెచ్చరిక

హాలియా మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని, ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ప్రభుత్వ భూములను కొల్లగొడుతున్నారని, ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అనర్హులకు ఇళ్లు ఇస్తున్నారని వాదించారు.

కాంగ్రెస్ నాయకులు తమ విధానాన్ని మార్చుకోకపోతే దానికి ప్రజలు తగిన జవాబు ఇస్తారని భగత్ హెచ్చరించారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే, అవినీతి ఆరోపణలపై పూర్తి విచారణ జరిపించి నిజాలను బయటపెడతామని ఆయన తెలిపారు.

కార్యక్రమంలో పాల్గొన్నవారు.ఈ ధర్నా, రాస్తారోకో కార్యక్రమంలో నాగార్జునసాగర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, పట్టణ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. “సీఎం డౌన్ డౌన్”, “దొంగల పాలన.. దోపిడీ పాలన” అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు.

లింగమంతుల స్వామి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా నవంబర్ 2 జనంసాక్షి

త్రిపురారం మండలం పరిధిలోనిపెద్దదేవలపల్లి గ్రామంలో ఏర్పాటైన శ్రీ లింగమంతుల స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన స్వామి వారికి పూజలు సమర్పించి, గ్రామస్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామంలో శ్రీ లింగమంతుల స్వామి విగ్రహ ప్రతిష్ఠ వల్ల ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం పెరుగు తుందని, గ్రామస్థుల సమష్టి కృషి ఫలితంగా ఈ మహోత్సవం ఘనంగా నిర్వహించబడుతున్నట్లు అన్నారు. స్థానిక ప్రజల సహకారంతో ఆలయా భివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో త్రిపురారం సర్పంచ్ బైరం లక్ష్మి కృష్ణ, లోక్యతండ సర్పంచ్ జ్యోతి కాంతారావు, బొర్రాయపాలెం సర్పంచ్ రాయన బోయిన పుల్లయ్య యాదవ్ తో పాటు అనుముల శ్యాంసుందర్ రెడ్డి, అనుముల సుధాకర్ రెడ్డి, అనుముల శ్రీనివాస్ రెడ్డి, జంగిలి శ్రీనివాస్



యాదవ్, జంగిలి రామలింగయ్య, యాదవ్ తాటికొండ తిరుపతయ్య, బొడ్డు సాయిలు మండే వీరయ్య, రాచమల్ల సైదులు, కురాకుల వెంకటేశ్వర్లు, పిడిగం నాగయ్య, తాటి సత్యపాల్, వడ్డే సతీష్ రెడ్డి, దేవసాని శ్రీనివాస్ రెడ్డి, నడ్డి బాలరాజు యాదవ్ తదితర ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.కార్యక్రమ ఏర్పాట్లలో గ్రామస్థులు, స్థానిక నాయకులు సమష్టిగా సహకరించడంతో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది.

రాంరెడ్డిపల్లిలో మెగా జాబ్ మేళా

నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు..

నెలకు రూ.19,288 వేతనం

మర్రిగూడ, నవంబర్ 2 (జనంసాక్షి):



నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించ నున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఈ మేళా జరగనుందని సర్పంచ్ లపంగి నర్సింహా తెలిపారు.గ్లిడ్జ్ వెండర్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాలో ఎంఎన్‌సీ ఇంటర్నేషనల్ కంపెనీ ప్రతినిధులు నేరుగా పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణులై, 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు అర్హులని వెండర్ సతీష్ వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 19,288 వేతనం అందించనున్నట్లు తెలిపారు. జాబ్ మేళాకు హాజరయ్యే వారికి ఉచిత భోజనం, రవాణా సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన నిరుద్యోగులు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పాన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు.

చౌటుప్పల్ 100 పడకల ఆసుపత్రి నిర్మాణం నిర్లక్ష్యానికి భాలీ ధర్నా

విద్య,వైద్య సాధనకు ఈ ఎల్ వి ఫౌండేషన్ పోరాడుతుంది

అధికారులు,పాలకులు ఆస్పత్రి ఎప్పుడు ప్రారంభిస్తారు తేదీని ప్రకటించాలి

కలెక్టరేట్ వద్ద ధర్నాలో సామాజికవేత్త డాక్టర్ ఈ ఎల్ వి భాస్కర్



భువనగిరి, నవంబర్ 2(జనంసాక్షి)

చౌటుప్పల్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని ఈ ఎల్ వీ భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరగదిండ్ల భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆసుపత్రి నిర్మాణ పనుల్లో జాప్యాన్ని నిరసిస్తూ చౌటుప్పల్ ప్రజలతో కలిసి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌క కార్యాలయంలో వినతిపత్రం అందజేసి ఆసుపత్రి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా ఇరగదిండ్ల భాస్కర్ మాట్లాడుతూ.. చౌటుప్పల్ పట్టణంతో పాటు పరిసర మండలాలకు చెందిన వేలాది మంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఆసుపత్రి నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు, అత్యవసర వైద్య పరిస్థితులు, ప్రసవాలు, ఇతర అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు సరైన వైద్య సేవలు అందక రోగులను దూర ప్రాంతాల్లోని ఆసుపత్రులకు తరలించాల్సి వస్తోందన్నారు. దీనివల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పడటమే కాకుండా విలువైన సమయం వృథా అవుతోందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో వైద్యం అందక రోగులు, వారి కుటుంబ సభ్యులు ఆందోళన కు గురవుతున్నారని పేర్కొన్నారు. చౌటుప్పల్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాలు, మండలాల ప్రజల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ ఆసుపత్రిని వీలైనంత త్వరగా ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని కోరారు. నిర్మాణ పనుల్లో ఉన్న అడ్డంకులను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించి పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేవలం భవన నిర్మాణం పూర్తి చేయడమే కాకుండా, ఆసుపత్రి ప్రారంభానికి అవసరమైన వైద్య పరికరాలు, అత్యవసర చికిత్సా సదుపాయాలు, ల్యాబ్, మందులు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బందిని కూడా ముందుగానే సమకూర్చాలని సూచించారు.ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించా లంటే ఆసుపత్రిలో అన్ని విభాగాలను అందుబాటు లోకి తీసుకురావాలని, 24 గంటల అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. చౌటుప్పల్ ప్రాంత ప్రజల చిరకాల వైద్య అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని సంబంధిత అధికారులతో సమన్వయం చేసి ఆసుపత్రిని త్వరగా ప్రారంభించేలా కృషి చేయా లని ఇరగదిండ్ల భాస్కర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే చౌటుప్పల్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు లభిస్తాయని, పేద ప్రజలకు ప్రైవేట్ ఆసుపత్రుల ఖర్చుల భారం తగ్గుతుందని తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ఈ కీలక సమ స్యపై ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తక్షణమే స్పం దించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బుద్ద సురేష్, ఆలే శ్రీలత చిరంజీవి, బత్తుల జయమ్మ దాసు, బోదాసు వెంకటేష్, బండమీది కిరణ్ (ఉపసర్పంచ్), గుండె మల్లేష్ యాదవ్, మారం శివ, తోకల సాయి, సంజుత, సందీప్ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యం విక్రయించాలి

అధిక ధరలకు విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు : కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట(జనంసాక్షి):



జిల్లాలో బియ్యం విక్రయాలను ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారమే జరగాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి బియ్యం విక్రయించే వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు.సోమవారం కలెక్టరేట్ లో సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, సూర్యాపేట జిల్లా హోల్‌సేల్ రైస్ డీలర్లతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బియ్యం ధరలను నియంత్రిస్తూ వినియోగదారులకు సరసమైన ధరలకు బియ్యం అందుబాటులో ఉండేలా రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ డీలర్లు సహకరించాలని సూచించారు.ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే అధిక ధరలకు బియ్యం విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రభుత్వం నిర్దేశించిన బియ్యం ధరల పట్టికను అన్ని బియ్యం విక్రయ కేంద్రాలలో ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా ప్రదర్శించాలని ఆదేశించారు.ధరల విషయంలో పారదర్శకత పాటిస్తూ, వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు వ్యాపారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.ఈ సమావేశంలో పాల్గొన్న రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ రైస్ డీలర్లు ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారమే బియ్యం విక్రయిస్తామని, ప్రభుత్వం నిర్దేశించిన ధరల పట్టికను తమ దుకాణాలలో తప్పనిసరిగా ప్రదర్శిస్తామని జిల్లా కలెక్టర్‌కు హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ బి.హరిసింగ్, డీఎస్ఓ మోహన్ బాబు, జిల్లా మేనేజర్, సివిల్ సప్లైస్ శ్రీధర్ రెడ్డి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకున్న మబ్బు అబ్బాస్ ఫౌండేషన్

అత్మకూర్ (ఎం)

జనంసాక్షి నవంబర్ (02)



మానవత్వంతో ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచారు మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్. మండలం లో ని రహీంఖాంపేట గ్రామానికి చెందిన గంధమల్ల ఉపేందర్ (24), నర్సయ్య కుమారుడు, ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబానికి భరోసా కల్పిస్తూ రూ. 5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఆపద సమయంలో అండగా నిలిచిన మబ్బు మహేష్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గంధమల్ల మహేష్, విజయ్, మచ్చగిరి, యాదగిరి, చింటూ, జశ్వంత్, సాయి, మధు, జగదీష్, నవీన్, ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరైడ్ విముక్తి మునుగోడుకు డిండి జలాలే శాశ్వత పరిష్కారం!

◆ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సమష్టి కార్యాచరణ.. 300 చెరువుల అభివృద్ధికి ప్రణాళికలు

◆చెరువుల అభివృద్ధికి నిధులివ్వాలి.. కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలి

◆ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



మర్రిగూడ, నవంబర్ 2(జనంసాక్షి)

ఎల్‌నినో ప్రభావంతో పంట దిగుబడులు తగ్గి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో నీటి వనరుల పరిరక్షణ, కరువు నివారణ చర్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కోరారు. మునుగోడు నియోజకవర్గానికి ఫ్లోరైడ్ సమస్య నుంచి శాశ్వత విముక్తి కల్పించడంతో పాటు సాగునీటి అవసరాలు తీర్చేందుకు డిండి ఎత్తిపోతల పథకమే కీలక పరిష్కారమని పేర్కొన్నారు. వికసిత్ భారత్?జి రామ్ జి కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ నల్లగొండ ఆధ్వర్యంలో మునుగోడు క్యాంపు కార్యాలయ ఆవరణలో ఎల్‌నినో ప్రభావం, నివారణ చర్యలపై నియోజకవర్గస్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యాదాద్రి, నల్లగొండ జిల్లాల ఉన్నతాధికారులు, మునుగోడు నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అత్యధిక ఫ్లోరైడ్ ప్రభావం ఉన్న ప్రాంతాల్లో మునుగోడు నియోజకవర్గం ఒకటని, ఈ సమస్యకు డిండి ఎత్తిపోతల పథకం ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో వేల కోట్ల రూపాయల వ్యయంతో రిజర్వాయర్ల పనులు చేపట్టినా నీటి తరలింపు విషయంలో స్పష్టమైన నిర్ణయం తీసుకోలేకపోయారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో చర్చించి ఏడుల రిజర్వాయర్ నుంచి నీటిని తరలించే దిశగా నిర్ణయం తీసుకున్నామని వివరించారు. మునుగోడుకు నీటిని తీసుకొచ్చే క్రమంలో ఎదురైన ఏడుల రిజర్వాయర్ నీటిమట్టాల సమస్యను కూడా పరిష్కరించుకున్నామని, నాగర్‌కర్నూల్, వనపర్తి ప్రాంతాల ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని పనులు ముందుకు తీసుకెళ్లాల్సి ఉందన్నారు.

300 చెరువుల అభివృద్ధికి ప్రణాళికలు

నియోజకవర్గవ్యాప్తంగా 300 చెరువులను గుర్తించి ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించామని ఎమ్మెల్యే తెలిపారు. వేల కోట్ల రూపాయలతో ఎత్తిపోతల పథకాలు చేపడుతున్నప్పటికీ, వర్షపు ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించే చిన్న నీటి వనరుల అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. చెరువుల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు లక్ష కోట్ల రూపాయల వ్యయం చేసినప్పటికీ మునుగోడు వంటి ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో చెరువుల అభివృద్ధికి నిధులు కేటాయించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని వ్యాఖ్యానించారు. మునుగోడు నియోజకవర్గంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.

రైతులకు అండగా నిలవాలి

ఎల్‌నినో ప్రభావంతో పంట దిగుబడులు తగ్గిన నేపథ్యంలో మునుగోడు రైతులకు అధిక పరిహారం అందేలా ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపించాలని కలెక్టర్‌ను కోరారు. పంట నష్టపోయిన రైతులతో పాటు కౌలు రైతులను కూడా ప్రభుత్వం ఆదుకోవాలని సూచించారు. సంప్రదాయ వ్యవసాయ పద్ధతులతో ఆశించిన గిట్టుబాటు ధర లభించడం లేదని, సేంద్రియ పద్ధతుల్లో వాణిజ్య పంటల సాగును ప్రోత్సహించి అంతర్జాతీయ మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే చెరువులు, కుంటల అభివృద్ధి పనులు చేపట్టాలని, కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. రైతన్నలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తాను మంత్రి కాకపోవచ్చు, ముఖ్యమంత్రి కాకపోవచ్చు కానీ క్యారెక్టర్, క్రెడిబిలిటీ, కెపాసిటీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఉందని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. మునుగోడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని, అందుకు అనుగుణంగా ప్రభుత్వ నిధులు కూడా అందాల్సిన అవసరం ఉందన్నారు. కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, యాదాద్రి, నల్లగొండ జిల్లాల అదనపు కలెక్టర్లు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, మునుగోడు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలి

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్,ఎస్పీ కె.నరసింహ

సూర్యాపేట (జనంసాక్షి):

ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమంలో భాగంగా పాత ఎస్పీ కార్యాలయంలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ అధికారుల సమక్షంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలంటే తీవ్ర పోటీని ఎదుర్కోవాల్సి ఉంటుందని, ఆ పోటీని తట్టుకుని ఉద్యోగం సాధించాలంటే విషయ పరిజ్ఞానంతో పాటు మానసికంగా కూడా సిద్ధం కావాలని అన్నారు.జిల్లా ఎస్పీ ప్రత్యేక ప్రణాళికతో, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో నాణ్యమైన ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా మొత్తం 400 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణ, వసతి సౌకర్యం కల్పిస్తున్నామని, సూర్యాపేటలో 200 మందికి, కోదాడలో 200 మందికి శిక్షణ అందిస్తున్నామని వివరించారు.నిపుణులైన అధ్యాపకులు, ఫిజికల్ ఈవెంట్స్ శిక్షకుల ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగుతోందన్నారు. అభ్యర్థులు ప్రతి సబ్జెక్టుపై లోతైన అవగాహన పెంపొందించుకోవాలని, చదివే ప్రతి అంశాన్ని నోట్ పుస్తకంలో రాసుకోవాలని సూచించారు.గత ప్రశ్నపత్రాలను అధ్యయనం చేసి ప్రశ్నల సరళిని అంచనా వేయాలని, అందుబాటులో ఉన్న సమయానికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించుకోవాలని అన్నారు.ప్రతి సబ్జెక్టును కనీసం మూడుసార్లు చదివి రివిజన్ చేయాలని సూచించారు.పోటీ పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, ఒత్తిడి వల్ల నేర్చుకున్న విషయాలను కూడా మర్చిపోయే అవకాశం ఉంటుందని తెలిపారు.జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు అన్ని రకాల సదుపాయాలు, అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ పట్టుదలతో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని, తల్లిదండ్రులకు, కుటుంబానికి అండగా ఉండాలని సూచించారు.జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో ఈ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో శిక్షణ డిప్యూటీ కలెక్టర్లు అనూష, రవితేజ, డీఎస్పీ ప్రసన్నకుమార్, ఆర్ముడ్ డీఎస్పీ నరసింహ చారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, జానయ్య, ఆర్ఎస్ఐలు సురేష్, సాయిరాం, అధ్యాపకులు, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయ పోరాటానికి సంఘీభావం

సామాజికవేత్త డాక్టర్ ఈ ఎల్ వి భాస్కర్

భువనగిరి, నవంబర్ 2(జనం సాక్షి)

తెలంగాణ వైద్యశాఖ లో అవుట్సోర్సింగ్ సేవలందిస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు చేస్తున్న ఉద్యమ పోరాటం న్యాయమైనదని వారి పోరాటానికి ఈ ఎల్ వి ఫౌండేషన్ అండగా ఉంటుందని ఈ ఎల్ వి ఫౌండేషన్ అధినేత సామాజికవేత్త డాక్టర్ ఈ ఎల్ వి భాస్కర్ సంఘీభావం తెలిపారు. సోమవారం చౌటుప్పల్ పట్టణానికి చెందిన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయం పక్కనే గత 21 రోజుల నుండి ఎన్ హెచ్ ఎం తాత్కాలిక ఉద్యోగులు జీవో నెంబర్ 60, 1195 అమలు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని దీక్షలు చేస్తున్న సందర్భంగా సామాజికవేత్త డాక్టర్ భాస్కర్ తాత్కాలిక ఉద్యోగులకు పూర్తి మద్దతు ప్రకటించారు. ఆయన ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలో వేలాదిమంది తాత్కాలిక ఉద్యోగులుగా చాలీచాలని జీతాలకు దశాబ్దాల కాలం నుండి నెట్టుకొస్తున్నారని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఏమాత్రం జీతాలు పెరగడం లేదని అన్నారు. ప్రభుత్వము ఎన్ ఎచ్ ఎం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. వారు చేస్తున్న న్యాయమైన పోరాటానికి తన వంతు కృషి చేస్తానని అవసరమైతే న్యాయస్థానాల్లో చేసే పోరాటానికి తన వంతు సాహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వము తీసుకొచ్చిన జీవో ప్రకారము ఉద్యోగులుగా వెంటనే గుర్తించాలని ఉద్యోగులు గత కొద్ది రోజుల నుండి నిరవధిక సమ్మె చేస్తున్న అధికారులలో ప్రభుత్వం లో ఎలాంటి చలనం లేదని అన్నారు. ప్రభుత్వము దిగివచ్చే వరకు ఉద్యమ పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాత్కాలిక ఉద్యోగులు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

